ప్రపంచ సాహిత్యం-37

అలనాటి కొత్తగాలి

Master poems of English 1709-1796

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం-37

అలనాటి కొత్తగాలి

(Master Poems of English 1709-1796)

డాక్టర్ లంకా శివరామప్రసాద్

అలనాటి కొత్తగాలి

(Master Poems of English 1709-1796)

Translated by

Dr. Lanka Siva Rama Prasad

✧✧✧———————————✧✧✧

May 2017

All rights reserved

Copyright @ 2017
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
Prathima Institute of Medical Sciences
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

Dr. Lanka Siva Rama Prasad
Srijana Lokam / Writer's Corner
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

E-book: www.kinige.com

Price : ₹ **200** **$ 4**

Cover Design & Post Script : **Prakash Pula**

Printed at :

Vasavi Printers
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

This book is presented to...

ఈ రచనకు ఆధార గ్రంథాలు

Master Poems of the English Language
Edited by Oscar Williams

ప్రస్తావన

1709–1796 మధ్యకాలంలోని ఆరుగురు కవులు వ్రాసిన అద్భుత గీతాల అనువాద సంపుటి ఇది. Samuel Johnson - The Vanity of Human Wishes - గొప్పతనం కోసం మానవుడు పడే ప్రాకులాట నిరర్థకమని వచిస్తూ, లాటిన్ కవి జువెనాల్ అభిప్రాయాల్ని సమర్థిస్తుంది ఈ కవిత.

Thomas Gray - Elegy Written in a Church-yard - మృత్యువును, మరణానంతర జీవనస్మృతులను వర్ణించే బహుళ ప్రజాదరణ పొందిన గీతం.

William Collins వ్రాసిన Ode to Evening సాయంసమయాన్ని దేవకన్యగా భావిస్తూ వ్రాసిన అపురూప కవిత.

Christopher Smart వ్రాసిన A Song to David అత్యంత మార్మికమైనది. డేవిడ్ జీవితంలోని ముఖ్య ఘట్టాల్ని వర్ణిస్తూ క్రీస్తును, క్రైస్తవ మతాన్ని కొనియాడే అద్భుత కవిత.

Oliver Gold Smith వ్రాసిన The Deserted Village మనం ఇప్పుడు మన పల్లెటూళ్లను చూస్తున్నట్లే ఉంటుంది.

చివరగా Robert Burns వ్రాసిన ఆరు గీతాలు వాటికవే సాటి. ఈ ఆరుగురు కవుల కవితలలోని కొత్తగాలి తర్వాతి కాలంలో పెనుమార్పులకు ప్రేరణ అయినది. ఆంగ్ల కవిత్వంలో Master Poems గా ప్రసిద్ధికెక్కిన కవితలను అనువదించే యజ్ఞంలో భాగంగా వస్తున్న ఈ కవితాసంపుటిని తెలుగు సాహితీ లోకం ఆశీర్వదిస్తుందని సృజనలోకం మనసారా విశ్వసిస్తున్నది.

– డాక్టర్ లంకా శివరామప్రసాద్

విషయసూచిక

1. శామ్యూల్ జాన్సన్ (Samuel Johnson)

1) నిరర్థక కోర్కెలు (The Vanity of Human Wishes) 7

2. థామస్ గ్రే (Thomas Gray)

1) స్మృతిగీతం (Elegy Written in a Country Church Yard)...... 22

3. విలియం కాలిన్స్ (William Collins)

1) సాయంకాలపు గీతం (Ode to Evening) 29

4. క్రిస్టఫర్ స్మార్ట్ (Christopher Smart)

1) డేవిడ్ పాట (A Song to David) 33

5. ఆలివర్ గోల్డ్‌స్మిత్ (Oliver Goldsmith)

1) పాడుబడిన గ్రామం (The Deserted Village) 46

6. రాబర్ట్ బర్న్స్ (Robert Burns)

1) మనిషెప్పటికైన మనిషే (A Man is a Man for all that) 64

2) ఎర్ర, ఎర్ర గులాబి (The Red, Red Rose) 66

3) ఈల వేయి, నీవద్దకు వస్తాను (O, Whistle and I will come) ... 67

4) ఓ లామ్మాస్ రాత్రి (Once upon a Lamma's Night) 68

5) తియ్యని ముద్దు (Ae Fond Kiss) 70

6) ఆనాటి జ్ఞాపకాల కోసం (Auld Lang Syne) 72



శామ్యూల్ జాన్‌సన్

(Samuel Johnson 1709-1784)

శామ్యూల్ జాన్‌సన్ కవి, వ్యాసకర్త, విమర్శకుడు, సంపాదకుడు. The most distringuished man of letters in English Literature. అతడి జీవితకాలాన్ని ఆధారంగా చేసుకుని James Boswell వ్రాసిన Life of Samuel Johnson - ఆత్మకథలలో ఆణిముత్యంగా పేరు గాంచింది. ఆంగ్లికన్ శాఖకు అనుయాయుడుగా 'టోరీ'లకు విశ్వాసపాత్రుడిగా డాక్టర్ జాన్‌సన్‌గా Samuel Johnson చిరస్మరణీయుడైనాడు.

తొమ్మిదేళ్లు శ్రమపడి 1755లో ప్రచురించిన A Dictionary of the Egnlish Language నవీన ఆంగ్లభాషపై ఎనలేని ప్రభావాన్ని చూపించినది. The plays of William Shakespeare, The History of Rasselas, Prince of Abissinia, Lives of the Most Eminent English Poets (17th 18th Century) అతడి ముఖ్య రచనలు.

Tourette Syndrome అనే వ్యాధివల్ల అతడికి అనేక Mannerisms, Tics (Coprolalia - derogatory remarks, Echolatia, Palilalia) Blinking, Throat Clearing, Abnormal jerks - ఉండి ఇబ్బంది పెట్టేవి.

18 సెప్టెంబరు 1709లో జన్మించి 13 డిసెంబరు 1784లో కన్నుమూసిన శామ్యూల్ జాన్‌సన్– The only truly great critic of English Literature గా ప్రసిద్ధికెక్కినాడు.

1. నిరర్ధక మానవ కోర్కెలు

(The Vanity of Human Wishes)

(The Tenth Satire of Juvenal Imitated)
యథా మానుపేచ్ఛా మానవేచ్ఛా నిరర్ధకీ)

విశాల దృక్పథంతో సర్వేక్షణ చేస్తూ మనం
'చైనా' నుంచి 'పెరూ' వరకూ పరిశీలిద్దాం మానవజాతిని;
ప్రతి ఉద్వేగపు శ్రమను, ప్రతి తప్పని కష్టాన్ని గుర్తించి
సామూహిక జీవనంలోని తీరికలేని దృశ్యాల్ని గమనిద్దాం.
అప్పుడు చెబ్దాం భయాలు, ఆశలు కోరిక ద్వేషం ఎలా
విధి మసక ప్రహేళికలో ఉచ్చులు పరచి ఉంటాయో,
తడబడుతూ మనిషి సాహసపు గర్వంతో ఎక్కడ మోసపోతాడో,
మార్గదర్శకుడు లేకుండా దుర్గమ మార్గాలలో ఎలా నడుస్తాడో
పొగమంచులో కానరాని మోసకారి భూతాలను ఎలా వదిలించుకుంటాడో
వింత దుష్కార్యాలను వదిలించుకుని, మంచిగాలికై ఎలా వెదుకుతాడో
ఎంత అరుదుగా సహేతుక కారణం అతడి మొండి నిర్ణయాన్ని సడలించి
ధైర్యపు హస్తాన్ని నియంత్రించి, ప్రార్థించే స్వరాన్ని ప్రేరేపిస్తుందో
ఎలా రాజ్యాలు మునిగాయో, మంచి పథకాలు తొక్కిపెట్టబడగా,
ఎలా ప్రతీకారం మూర్ఖుడి కోరికను మన్నిస్తుందో,
ప్రతి నెప్పి కలిగించే బాణానికి విధి రెక్కలనెలా ఇస్తుందో,
ప్రకృతి ప్రతి బహుమతీ, ప్రతి అందమైన కళాకృతీలో
ప్రమాదకరమైన తీవ్ర వేగంతో ధైర్యం మెరుస్తుందో
ప్రాణాలను హరించే మాధుర్యంతో వాగ్ధాంటి ప్రవహిస్తుందో
ఎక్కడైతే నేరారోపణ వక్త ఊపిరిని ఆపేస్తుందో
మృత్యువుపై ఆగని అగ్ని ఎలా గడ్డ కడ్తుందో చూద్దాం!
అరుదుగా గమనిస్తాం జ్ఞానిని, సాహసికుడిని
స్వర్ణపు మూకుమ్మడి హత్యలలో మునిగిపోవడాన్ని

పనికిరాని చీడ! అదుపూ ఆపులేని ఆగ్రహావేశాలు
మానవజాతిపై చేసిన అనేక నేరాల చిత్రాలను;
బంగారం కోసమే, కూలికి పనిచేసే క్రూరుడు కత్తి దూస్తాడు
బంగారం కోసమే, తొత్తు న్యాయాధిపతి న్యాయాన్ని వక్రీకరిస్తాడు.
డబ్బు మీద డబ్బు- సత్యాన్ని, రక్షణను కొనగలదా?
నిధి పెరిగిన కొద్దీ అపాయాలు ఎక్కువవుతాయి.

చరిత్రను చెప్పనీయ్! రాజులు శత్రువులై ఏం పరిపాలించారో!
అనిశ్చితమైన బిరుదులు రాజ్యాల్ని పిచ్చిగా వణికించాయి.
కత్తి వదిలేసిన చెత్తలో విగ్రహాలు పరిగె ఏరుకుంటుంటే
ప్రభువు కన్నా సేవకుడు ఏరకంగా సురక్షితంగా ఉన్నాడు?
అధికారపు ఆగ్రహం కింద అణచబడి అథములు గొణుగుతుంటారు.
డబ్బున్న మోసగాడిని జైలు బురుజులో బందీని చేస్తారు.
అతడి కుటీరాన్ని అంటుకోరు, హాయిగా నిద్రపోతాడతడు,
జప్తు చేసుకునే రాబందులు చుట్టూ ఎగుర్తూనే ఉన్నా!

అవసరం ఉన్న ప్రయాణీకుడు ప్రశాంతంగా, ఉల్లాసంగా
బంజరు భూముల్లో తిరుగుతూ తన శ్రమను గానం చేస్తాడు.
నిన్ను అసూయ ఆక్రమించుకున్నదా? పెరుగుతున్న ఆనందాన్ని అణచిపెట్టు!
అతడి ధనాన్ని ఎక్కువచేసి, అతడి మనశ్శాంతిని, శాంతిని చంపేయి!
ఇప్పుడు భయాలు అదృష్ట పరిణామక్రమంలో ఆవరించుకుంటాయి.
చప్పుడు హెచ్చరికలను తునాతునకలు చేస్తుంది; వణుకుడు నీడౌతుంది.
వెలుగు గాని, చీకటిగాని ఏదీ నెప్పిని తగ్గించవు.
ఒకటి దోపిడి సొమ్ము చూపిస్తుంది, మరొకటి దొంగను దాస్తుంది.
అయినా, ఒక సాధారణ అరుపు ఆకాశాన్ని కదిలిస్తుంది.
లాభం, ఆడంబరం కళంకపు అలల్ని తెచ్చుకుంటాయి.
శ్రమించే రాజకీయవేత్త భయాలు, వ్యాకులత ఎవరికీ తెలియవు,
మోసగాడైన శత్రువుకూ, ఆశ్చర్యపడ్తున్న వారసుడికి కూడా!

డెమొక్రెటస్, ఇంకోసారి ఈ నేలపై జన్మించు!
చిరునవ్వుల విజ్ఞానంతో, విశదపరచే ఆనందంతో,
చూడు, ఈ దుమ్ముకొట్టుకున్న బతుకులు కప్పుకున్న నవీన వస్త్రాలను!
రకరకాల మూర్ఖులకు శాశ్వత చతురతను తినిపించు.
కోరిక తృప్తికి సంకెళ్లు వేసిన చోట వాళ్లు నవ్వగలుగుతారు.
శ్రమ వంచనను తొక్కివేయగా, మనిషి ముక్కగా మిగుల్తాడు.
అక్కడ ధనం ప్రేమించబడక, ఏడ్చేవాళ్లు లేకుండా పడి చస్తుంది.
గర్వం పోషించే పరాన్నభుక్కులరుదుగా కనిపిస్తారు.
అక్కడ నకిలీ చర్చల, వాగ్యుద్ధాల రూపాలు తెలియవు.
కొత్తగా తయారైన మేయర్ అదుపులేనితనాన్ని చూడవు
అనుకూలుర్ని మార్చినా, న్యాయాలు అనుకూలంగా మార్చుకోబడవు.
ఒక విషయంపై నిర్ణయం తీసుకునేప్పుడు సెనేట్‌లో చర్చలు జరుగుతాయి.
బ్రిటన్ నాగరిక తెగను నీవెలా వణికించగలవు?
వేగవంతమైన తృణీకార బాణాలు, గుచ్చుకునే వెక్కిరింతలు.
జాగరూకతతో ఉండే సత్యం, పసిగట్టే స్వభావం.
ప్రతి దృశ్యాన్ని, సందర్భాన్ని వేదాంతపు నేత్రంతో చూడడం
నీకోసమే చేయబడిన ఆటబొమ్మలు, లేదా ఖాళీ ప్రదర్శనలు.
ఆనందపు వస్త్రాలు ఆహార్యాలు కష్టాల దుఃఖపు తెరలు
ఈ తమాషాకు తోడ్పడ్తాయి, ఆనందాన్ని పోషిస్తాయి.
కారణం లేని ఆనందాలు, వృథా దుఃఖాలు–
అటువంటి తృణీకారం జ్ఞాని మనస్సును నింపింది.
మానవజాతిని చూసిన ప్రతిసారీ మరింత ఎక్కువైనది.
ఈ తృణీకారమెటువంటిది, అయినా, నీ స్వరం గొంతెత్తేది,
ప్రతి స్థితినీ శోధించేదీ, ప్రతి ప్రార్థననూ ప్రచారం చేసేది కదా!

అసంఖ్యాక యాచకులు ఉన్నత పదవుల ద్వారం వద్ద గుమికూడతారు
ధన దాహం, గొప్పవాళ్లం కావాలని ఉత్సాహం.
అదృష్టం దొరకకుండా, వాళ్ల ఆగని పిలుపును వింటూనే ఉంటుంది.
వాళ్లు ఎక్కుతారు, ప్రకాశిస్తారు, ఆవిరై అదృశ్యమవుతారు

ప్రతి దశలోనూ శాంతి వ్యతిరేకులు హాజరవుతారు.
వాళ్ల పలాయనాన్ని కుక్కలు కూడా అసహ్యించుకుంటాయి.
వాళ్ల అంతిమ ఘడియలు అవమానంతో నిండి ఉంటాయి.
ప్రేమ ఆశతో అంతమవుతుంది, రాజకీయవేత్త ద్వారా కూలిపోతుంది.
ఉదయ సందర్శకుల తాకిడి ఉండదు
వారం వారం వార్తలు రాసేవాడు అబద్ధాలు రాయాల్సి వస్తుంది

జీవితాన్ని అంకితం చేసినవాడు ధనంవేపు పరుగులెడ్తాడు
ప్రతిగది నుంచీ రంగు పూసుకున్న ముఖం బయటకు వస్తుంది.
అక్కడ ప్రకాశవంతమైన పల్లాడియం వేలాడదీస్తారు వాళ్లు
అది వంటగదిలో పొగచూరి ఉంటుంది, లేదా వేలం వేయబడ్తుంది.
ఇంకా అందంగా కనబడాలని దానికో చక్కని చట్రం బిగించబడ్తుంది.
ఇప్పుడు ప్రతి వాక్యంలోనూ, గీతలోనూ కనిపెట్టలేము
వీరోచితమైన కార్యాలు, దైవికమైన దివ్య స్వరూపాలు.
వక్రించిన రూపం పతనాన్ని సమర్థిస్తుంది.
ఆగ్రహపు గోడను ఏవగింపు రద్దు చేస్తుంది.

ఆఖరి విజ్ఞాపనను బ్రిటన్ వినిపించుకోదు
శత్రువుల అంతానికి, తన కిష్టమైన వాళ్ల రక్షణకు సంతకం చేస్తుంది.
స్వాతంత్ర్యాభిలాషుల వ్యతిరేక ప్రదర్శనా వలయాలగుండా
ఉన్నతోద్యోగులు, రాజవంశీకుల, రాజుల నిందలు కానరావు.
మన మెత్తటి గుంపు వాళ్ల దేశభక్తి గొంతును నొక్కుతుంది.
ప్రశ్నలడగకుండా వోటు విలువ నడుగుతుంది.
వారం వారం పరువునష్టపు ప్రకటనలు, ఏడేళ్ల తాగుబోతు వినోదాలు.
వాళ్ల కోరికంతా గొడవలు చేయడం, గుమికూడడమే!

మూర్తీభవించిన హుందాతనపు 'వోల్సీ'ని చూడండి
గొంతులో ఉట్టిపడే న్యాయం, హస్తంలో అదృష్టం
చర్చి అతడి రాజ్యం, దాని అధికారాలు అతడికి అప్పగింతలు
అతడి ద్వారా రాజోచితమైన సంపదల కిరణాలు మెరుస్తాయి.

అతడు తల కదిలిస్తే గౌరవం, హోదాలు ప్రవహిస్తాయి.
అతడి చిరునవ్వు చాలు రక్షణకు సూచన
అయినా ఇంకా పైకెదగాలని, ఉన్నత శిఖరాలకెగబాకాలని ఆశ
ఒక ప్రకటన తరువాత మరోటి, అధికారంపైన ఇంకా అధికారం.
దాని వలన సంతోషమేమీ లేదని తేలేవరకూ–
హక్కులన్నీ లొంగిపోయి, ఇక ఆక్రమించుకోవాల్సినదేమీ లేనంతవరకూ
చివరకు అతడి సామ్రాజ్యం నొసలు చిట్లిస్తుంది, రాజ్యపరివారం
ద్వేషపు చిహ్నాలను నిశితంగా గమనిస్తుంది.
అతడే మలుపు తిరిగినా ఎవడో అపరిచితుడి కన్ను.
యాచకులు, సందర్శకులు పట్టించుకోరు, అనుచరులు పారిపోతారు.
అందరూ భయపడిన రాజ్యాధికార గర్వం పటాపంచలౌతుంది.
స్వర్ణ ఛత్రం, మెరిసే చామరం, రాజభవనం, మితిమీరిన ఆడంబరం
పదును చచ్చిన సైన్యం, నికృష్టుడైన ప్రభువు
వయసు పెరిగి, చింత ఎక్కువై, వ్యాధులు ముదిరి
అతడు మతపు నీడన ఆశ్రయం పొందుతాడు
వ్యాధికి దుఃఖం తోడు కాగా, చెడు జ్ఞాపకాలు తెగ కుదుపుతుంటాయి.
రాజుల నమ్మకాన్ని అతడి ఆఖరి నిట్టూర్పులు మందలిస్తాయి.

నీవు చెప్పగలవా, శాంతికోసం పరితపిస్తున్న ఆలోచనలతో వ్యాకులం చెందినవాడా,
వోల్సీ సంపదలు, వోల్సీ మరణం తరువాత నీకు చెందుతాయా?
పోనీ ఇప్పుడు బతికినంతకాలం సంతృప్తిగా ఉండగలవా,
ట్రెంట్ తరపున్యాయం నీకు ఆమోదయోగ్యమేనా?
విధి నిర్ణయించిన అట్టడుగు లోతుల్లోకి వోల్సి ఎలా పతనమయ్యాడు
బలహీనమైన పునాదులపై ఇంత బరువునెలా నిలపగలిగాడు!
దురదృష్టపు దెబ్బకు నిండా మునిగిపోలేదా,
పెద్దపెద్ద శిథిలాలై మరింత అడుగునున్న లోయల్లోకి.

హంతకుడి కత్తికి మహామహుడు 'విల్లీర్స్' ఎలా దొరికినాడు?
హార్లే జీవిత చరమాంకాన వ్యాధిని కలిగించిందెవరు?

వెంట్‌వర్త్‌ను చంపిందెవరు, హైడ్‌ను ప్రవాసం పంపిందెవరు?
రక్షణలో ఉన్న ప్రభువులు, సంబంధం కలుపుకున్న రాజులు
అన్నీ రాజ్యాధికార కాంతుల్లో వెలగడానికే కాదా,
నిలుపుకోలేనంత అధికారం, చివరకు పదవీ త్యాగం.

కళాశాలలో పని చేయడానికి అవకాశం దొరకగానే
ఉత్సాహవంతుడైన యువకుడు కీర్తికొరకు అడుగుపెడ్తాడు
అతడిలోని ఉడుకురక్తం నరనరాన ఉరకలేస్తూనే ఉంటుంది.
తొడుక్కున్న అంగీ అతడిని ఉద్రేకంతో కాల్చివేస్తుంటూంది.
'బొడ్లీ' గోపురాలపై అతడి భవిష్యత్ శ్రమ వ్యాపించి
బేకన్ భవనాలు అతడి శిరస్సు దగ్గర వణుకుతుంటాయి.
ఇవే నీ దృక్పథాలయితే, యువకుడా, ముందుకు సాగు.
సత్య సింహాసనంవేపు నీకు గుణశీలాలు రక్షణనిస్తాయి.
నీ ఆత్మ సాధారణ ఉష్ణాన్ని చవిచూడదల్చుకుంటే
ఖైదు చేయబడిన సైన్సు తన ఆఖరి ఆశ్రయాన్ని వదులుకుంటుంది.
సహేతుక కారణం నీకు తన కాంతికిరణాలతో దారిచూపుతుంది.
పొగమంచు లాంటి సందేహాలపై పడి దారిని సుగమం చేస్తుంది.
క్షణికానందాలు మోసపు దయాగుణాన్ని ఆకర్షించరాదు.
విశ్రాంతిని పొగడరాదు, భయాన్ని దుర్గమంగా చూడరాదు.
కొత్తదనం కోసం అణువణువూ అన్వేషించాలి.
బద్ధకం వెదజల్లిన గంజాయి ధూమాలు వృధా కావాలి.
సౌందర్యం తన ప్రాణాంతకమైన బాణాలను సొగసుకాడిపై వేసి
అక్షరాల హృదయంపై తన గెలుపును ప్రకటించరాదు.
ఏ వ్యాధీ నీ నిద్రాణమైన నాళాల్లో చొరబడరాదు.
నీ నీడలో ఏ విషాదరూప భూతాలూ నిలబడరాదు, అయినా,
దుఃఖం నుంచో అపాయం నుంచో బయటపడిన జీవితాన్ని ఆశించాలి,
నీకొరకు వెనుదిరిగినవాడికి అంతాన్ని కోరుకోరాదు.
నీ కనులను ఈ నడుస్తున్న ప్రపంచంపైకి మరల్చు
అక్షరాలు రాయడం కాసేపు ఆపి, లోకజ్ఞానం సముపార్జించు

విద్వాంసుడి జీవితాన్ని ఏ రుగ్మతలు పీడిస్తాయో అర్థం చేసుకో.
శ్రమ, అసూయ, కోరిక, పోషకుడు చివరకు జైలు.
ప్రతి రాజ్యమూ క్రమేపీ తెలివిమీరుతుంది, నికృష్టంగా,
పాతిపెట్టబడిన ప్రతిభకు విరుచుకుంటుంది ఛాతిని బద్ధకంగా,
కలలు పొగుడుతుంటే ఇంకా, మరోసారి పాల్గొనాలి
లిడియా గాథనో లేదా, గెలిలియో అంతాన్నో వినాలి.

ఎప్పుడైతే జ్ఞానం తన ఆఖరి బహుమతిని ఇస్తుందో
ఆ మిరుమిట్లు గొలిపే ఖ్యాతిని శత్రువులూ విడిచిపెడ్తారు
అలగా జనం తప్పించుకున్నపుడు తిరస్కారంతోనో, ప్రతీకారంతోనో
తిరుగుబాటు ప్రతీకారపు కాలిగోళ్లు స్తోత్రాలను ఆక్రమిస్తాయి.
నీచమైన మనస్సులు చిన్ని జరిమానాలతో సరిపెట్టుకుంటాయి.
దోచుకోబడిన భవనమైనా, ముక్కలైన చిరుగు అయినా
అపాయకరమైన ప్రదేశాలతో గుర్తించబడి భీతి గొల్పుతుంది
ప్రాణాంతక జ్ఞానం అతడిని వధ్యశిల వేపు నడిపిస్తుంది.
అతడి సమాధి చుట్టూ చేరి కళాకారులు, మేధావులు ఏడుస్తారు
అతడి మరణవార్త విని మొద్దుబుర్రలు నిద్రపోతారు.

విందు వినోదాలు, విజయ ప్రదర్శనాలు
విలక్షణమైన కవాతులు, బందీలైన శత్రువులు
సెనెట్ కృతజ్ఞతలు, గెజెట్‌లో మహాకథనాలు
అడ్డూ అదుపులేని శక్తితో వీరోచిత కార్యాలు
అటువంటి లంచాలతో గ్రీకులు ఆసియాను చుట్టివచ్చారు
రోమన్లు ప్రపంచం మొత్తాన్ని వణికించారు
ఆ విధంగానే బ్రిటన్లు సుదూర తీరాల్ని జయించారు
డాన్యుబి, రైని నదుల్ని రక్తసిక్తం చేసారు
ఈ శక్తి, అధికారంలో ఏ శీలమూ వెచ్చబరచలేని పొగడ్త ఉంటుంది.
కీర్తిప్రతిష్ఠలు విశ్వమోహనంగా విస్తరిస్తాయి.

అయినా, సహేతుక కారణం యుద్ధపు సమ ఉజ్జీకాని ఆటపై ఉరుముతుంది.
ఓడిపోయిన దేశాలనన్నిటికీ ఒకే పేరు ఉంటుంది.
తరతరాలుగా పేరుకుపోయే శాశ్వత ఋణమది.
కష్టపడి కొనుక్కున్న హక్కుల్ని పుష్పగుచ్ఛాలు చెబుతాయి
పతకాలు తుప్పుపడ్తాయి, రాళ్లు శిథిలమౌతాయి.

ఏ పునాదులపై యోధుడి గర్వం నిలబడి ఉంటుందో,
స్వీడిష్ ఛార్లెస్ తన ఆశల్ని నిర్ణయించుకోనీ,
కఠిన శిలలలాంటి విగ్రహం, అగ్నిలా జ్వలించే ఆత్మ
ఏ అపాయాలూ అతడిని భయపెట్టవు, ఎంత శ్రమైనా అలిసిపోడు.
ప్రేమలో, భయంలో తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తాడు.
కష్టసుఖాలు కదిలించని ధీరుడు
శాంతి దండాలు అతడికి ఆనందాన్నివ్వవు.
యుద్ధ బాకా వినగానే రణరంగంలోకి దూకుతాడు.
చుట్టుపక్కల రాజుల శక్తుల్ని సమీకరించి చూస్తాడు.
వారిలో ఒకడు పైకెగసినా, ఇంకొకడు నేలకూలినా
శాంతి తన హస్తాన్నందించినా ఆమె సొగసును పట్టించుకోడు
'ఆలోచనతో ప్రయోజనంలేదు; ఏదీ మిగలకూడదు'–
మాస్కో బురుజులపై గోథిక్ జెండా ఎగిరే వరకూ,
ధృవపు ఆకాశం కింద అంతా నా సామ్రాజ్యమే–
మిలిటరీ కవాతుతో మొదలువుతుంది దండయాత్ర.
అతడి దృష్టిపడిన దేశాలు ఇక వేచి ఉండలేవు.
ఒంటరి తీరాలపై కరువు కాచుకుని కూర్చుంటుంది.
మంచు దేశాల్ని శీతాకాలం కోటలు కట్టి అడ్డుపడ్తుంది.
అతడు వస్తాడు, కోరిక, చలి అతడి మార్గాన్ని ఆపవు.
విజయం దాక్కుంటుంది, పుల్టోవా దినం దాక్కుంటుంది.
ఓడిపోయిన నాయకుడు విన్నువిరిగిన దళాలను వదిలేస్తాడు.
దూరదేశాల్లో అష్టకష్టాలు పడతాడు
తన ఓటమికి ఎవరో ఒకర్ని బలిపశువును చేస్తాడు

లేదా ఎక్కడో ఓ చోట యాచకుడిగా నిలబడ్తాడు
స్త్రీలు అడ్డుపడ్తారు, బానిసలు చర్చిస్తుంటారు
చివరకు ఆకాశం తన తప్పు దిద్దుకుంటుందా?
తప్పుదారిన నడిచిన దేశం అంతిమదశను గమనిస్తుందా?
శత్రురాజులు చేసారా ప్రాణాంతక గాయాన్ని?
లేక శత్రుదేశపు ప్రజలు మిలియన్లకొద్దీ అణచివేసారా అతడిని!
అతడి పతనం అతడిని ఒంటరి కోటలోకి చేరుస్తుంది
చిన్నికోట, నమ్మకస్తుడు కాని సేవకుడు–
ఒకప్పుడు అతడి పేరు చెబితే పారిపోయేది ప్రపంచం
ఇప్పుడతడొక నీతి వాక్యం లేదా ఓ పొడుపు కథ.
అన్ని కాలాల్లోనూ ఈ ఆడంబర దృశ్యాలూ, కష్టాలూ ఉన్నాయి.
పర్షియా నియంత నుంచీ బవేరియా ప్రభువు వరకూ
విపరీతమైన శత్రుత్వం, అనాగరికమైన గర్వం
సగం మానవ జనాభా అతడి పక్షాన సైనికులుగా
క్జెరెక్జెస్ ప్రభువు ఓ చిన్ని ఎరను పట్టుకోడానికి వస్తాడు
దారిలోని దేశాలన్నిటి సంపదలనూ హరించి వేస్తాడు.
వందిమాగధులు అతడి మహాసైన్యాన్ని మరింత పొగుడుతారు
ఈ అసంఖ్యాక సైన్యంతో అతడికి తృప్తి కలగదు.
కొత్త పొగడ్తలు, కొత్త బిరుదులు కావాలి, తగిలించుకోవాలి.
తరంగాల్ని కొరడా దెబ్బలు కొట్టి, గాలులకి సంకెళ్లు వేస్తాడు.
కొత్త కొత్త శక్తుల్ని, అధికారాల్ని సంపాదిస్తాడు, ఇంకా కావాలంటాడు.
ఎక్కడో తగుల్తుంది ఎదురుదెబ్బ, కదిలే దేవుడిని ఆపుతుంది.
సాహసికులైన గ్రీకులతడి ప్రదర్శనాన్ని పరిహసించారు.
తమ లోయల్లో ఆడంబరపు శత్రువును నరికి పోగులుపెట్టారు
అవమానించిన సముద్రమే అతడికి దిక్కయ్యింది.
అతడి పలాయనాన్ని వేగవంతం చేసిన చిన్నిపడవ
అక్కడే నిలబడి ఉన్నది స్థిరంగా, ఉదారంగు అలలు,
భీకరమైన తీరంలో శత్రువు తిరోగమనాన్ని చూస్తూ.

ధైర్యశాలి బవేరియన్ ప్రభువు, కాలం కలిసి రాలేదు,
సిజేరియన్ అధికారాల శిఖరాలను నేలకూల్చదలుచుకుంటే,
అనుకోని విజయాలు, సైనికుల పోరాటాలు
రక్షణలేని ప్రాంతాలు అయినాయి పాదాక్రాంతాలు.
కొద్దికాలమే! ఆస్ట్రియా తన దుఃఖాన్ని వెలిబుచ్చింది.
రాణి, అందాలరాణి కన్నీళ్లు, ప్రపంచ ఆయుధాలు చేబట్టింది.
కొండలపై నెగళ్లు వెలిశాయి ఒకదాని తర్వాత ఒకటి
దోపిడీలకు, పొగడ్తల కీర్తులకు గొప్ప అవకాశం.
భీకర క్రొయేషియన్లు, మొండి హుస్సార్‌లు
విధ్వంసపు వీరులు యుద్ధంలోకి దిగారు
కంగారుపడిన యువరాజుకు కొద్దిరోజుల పొగడ్తలు
తొందరపడినందుకు వచ్చింది ఫలితం త్వరత్వరగానే.
శత్రువుల ఎగతాళి, అనుచరుల నిందలు
తీవ్రమైన మనస్తాపం, అవమానం దారితీసింది మరణానికి.

నా జీవితాన్ని అసంఖ్యాక దినాలతో విస్తృతం చేయి
ఆరోగ్యం, రుగ్మతలలో, ప్రార్థనలలో
తనస్థితిని తననుంచి దాచుకుని, తెలుసుకునే ప్రయత్నం చేయక
ఈ దీర్ఘకాల జీవితమంతా దీర్ఘకాలపు కష్టాలమయం కాగా,
కాలం ఊగిసలాడ్తుంది పైన, నాశనం చేయడానికి అసహనంగా,
ఆనందపు దారులన్నీ మూసుకుపోతాయి.
భాగ్యవంతమైన ఋతువులు ప్రసాదించేవన్నీ వృధా అవుతాయి.
ఆకురాలు కాలపు ఫలాలు, వసంత పుష్పాలు
జీవం చచ్చిన కళ్లు, ముసలి తనపు దృక్కోణాలు
చూసి, ఆశ్చర్యపోవడం ఎందుకు ఆనందం కలగడం లేదని,
రుచిలేని మాంసాహారాలు, ఆనందమివ్వని మధువులు,
నిట్టూర్పులు విడుస్తూ ఆడంబరాలు విరమించుకుంటాయి
ఓ గాయకుల్లారా! రండి, మీ స్వరాలను శృతి చేయండి.
బాధను తగ్గించి ఉపశమనం కలిగించే గానాన్ని పరివ్యాప్తం చేయరండి

ఈ చెవిలోకి ఇక ఏ శబ్దాలూ చొరలేవా,
ఆర్ఫియస్ వస్తుంటే పర్వతాలు నృత్యం చేయలేదా అతడి గానానికి.
వీణ, వేణువు అతడి బలహీనమైన శక్తికి సాయం చేసాయా?
ఏ శీలవంతుడైన స్నేహితుడి సంగీతమైనా అక్కరకు వచ్చిందా?
అతడి నాలుకపై శాశ్వతత్వం తిష్టవేషింది.
సమాధి అసహ్యాకరమైనది, జరగకూడనిది.
ఈ కథ ఇంకా మెదుల్తూనే ఉంటుంది, వెక్కిరిస్తూనే,
అతిధుల్ని, బంధువుల్ని కలవరపెడ్తుంది.
పెరుగుతున్న ఆశలు అపహాస్యాన్ని ఆశ్చర్యపరచకున్నా
ఒక వృత్తాంతమై చెవులకింపుగా ఉంటుంది.
గమనిస్తున్న అతిధులు ఆఖరి నేరాన్ని సూచిస్తుంటారు.
కూతురి అసహనం, కొడుకు పెట్టే ఖర్చులు
శిరోభారమై చెడు ఆలోచనలను తెస్తాయి.
వీలునామా వ్రాసేంత వరకూ ఉద్వేగాలు ప్రజ్వరిల్లుతాయి.

లెక్కించలేనన్ని జబ్బులు కీళ్లపై దాడి చేస్తాయి.
బతుకును ఖైదుచేసి, అడ్డంకులు కలిగిస్తాయి.
అయినా దురాశ ఇంకా మిణుకు మిణుకుమంటూనే ఉంటుంది.
నష్టాలు మీదపడి దుఃఖాన్ని ఎక్కువ చేస్తుంటాయి.
అతడు అటూ ఇటూ కదుల్తూనే ఉంటాడు,
వణుకుతున్న హృదయంతో, వంపులున్న హస్తాలతో,
అప్పు పత్రాలు, స్థలాల తాకట్లు
అతడి నిధులపై అనుమానపు నిఘా కళ్లు
స్వర్ణాన్ని లెక్కిస్తూనే ఉంటాడు చచ్చేంత వరకూ.

అయితే సమతుల్యత కలిగినవాడు
తృణీకారము, నేరము లేని జీవితాన్ని గడుపుతాడు
అనుకోని శిథిలాల కనబడని జీవనం
అమాయకత్వం, హుందాతనం కలబోసిన జీవనవిధానం

ప్రశాంతత, దయాపూరిత ప్రవర్తనం
అంతరాత్మ చిరునవ్వుతో రాత్రులందు పలకరించడం
అందరికీ అతడిష్టుడు, స్నేహితుడు, కావల్సినవాడు.
అటువంటి కాలమే ఉంటే, ఎవరు అది ముగియాలనుకుంటారు?
అటువంటప్పుడు కూడా ఒక్కోసారి దురదృష్టం వెంటాడుతుంది.
అలిసిపోయిన నిముషాలకు ఎగిరే రెక్కలతో అదుముతుంది.
నూతన దినాల్లో వస్తాయి కొత్తకొత్త దుఃఖాలు
సోదరికి రుగ్మత, కుమార్తె విలాపం
నల్లటి శవవాహనంపై రక్త సంబంధీకుడి ఘనత
తెగిపోయిన స్నేహం రాల్చుతుంది కన్నీటిచుక్క
ఏడాది తరువాత ఏడాది, శిథిలంపై శిథిలం
వాడిపోతున్న జీవితంలో అప్పుడప్పుడూ కాస్త ఆనందం
కొత్తరూపాల జననం, కొత్త దృక్పథాల ఆవిష్కరణం
రంగస్థలంపై నున్న ఆరితేరిన వ్యక్తికి ఆధిక్యత అడ్డువస్తుంది.
ప్రకృతి దయతో ఆఖరికి విడుద పత్రం జారీ చేస్తుంది.
ప్రశాంతంగా విరమణ చేసేందుకు అవకాశాన్నిస్తుంది.

కొద్దిమందికి ఈ ఘడియలు కూడా వేచి ఉంటాయి
విధి గుటుక్కున మింగుతున్నపుడూ మగత ఉండదు.
నీ కాలం సమీపించిందని 'సొలొన్' హెచ్చరించగా
లిడియా చక్రవర్తి దిగువన శోధించినాడు
జీవితపు ఆఖరిదృశ్యంలో ఆశ్చర్యపు ఘటనలు
సాహసవంతుడి భయాలు, తెలివిగలవాళ్ల తప్పిదాలు
మర్లొబరొ కళ్ల నుంచి కన్నీళ్లు కాలువలు కడ్తాయి
చొంగకారుస్తూ, ఓ ప్రదర్శనగా ఆఖరి ఘట్టం ముగుస్తుంది.

తన జాతిని కొనసాగించాలని ప్రతి మాతృమూర్తి
ప్రతి కానుపూ అదృష్ట వదనం కావాలని కోరుకుంటుంది.
అయినా, సౌందర్యం నుంచే జనించే దుష్ఫలితాలను వాయుసూచిక చెబ్తుంది.

రాజును సంతోషపరచిన రూపాలను 'సెడ్లె' శపించలేదా!
గులాబి పెదవులు, మెరిసే కళ్లున్న అప్సరసల
ఆనందాలు జ్ఞానానికి దూరంగా ఉంచుతాయి.
రకరకాల వినోదాలు రమ్మని ఆహ్వానిస్తాయి.
పగలంతా ఆటపాటలు, రాత్రుల ఎడతెగని నృత్యాలు
ఆడంబరాలను తిరస్కరించేదెవరు? కళను మెచ్చుకోనిదెవరు?
హృదయానికి నచ్చిన కొత్త ఆహారం గురించి అడుగుతారు.
అదుపులోలేని మోహాన్ని నియంత్రించేదెవరు?
ప్రతి కన్యా నీకు శత్రువే, ప్రతి యువకుడూ జతగాడే!
నీ కీర్తితో పాటు రాగద్వేషాలూ వృద్ధి చెందుతాయి.
శత్రువుతో యుద్ధం, ప్రేమికుడిపై పెత్తనం
శీలం అరుస్తూ ఉంటుంది దూరపు గొంతుతో.
వినబడీ వినబడనట్లున్న, పశ్చాత్తాపం పడి ఉంటుంది.
అలసత్వంతో అలసిపోయిన, రాజ్యాన్ని వదులుకుంటుంది.
గర్వం, విచక్షణ ఆమె స్థానాన్ని ఆక్రమించుకుంటాయి.
అంతమంది జనం, ఒక్కరూ లక్ష్యపెట్టరు
అపాయరహితమైన స్వేచ్ఛ ఆమెకు స్నేహితుడు కాగా
సంరక్షకులు లొంగిపోతారు, ఏదో ఉన్నత శక్తి ఆదేశించగా
ఇష్టాన్ని బట్టి విచక్షణ, పొగడ్తలతో గర్వం లొంగిపోతాయి.
సౌందర్యం మోసగించబడినట్లు పతనమవుతుంది.
అసహ్యించుకోబడి, విచారంగా నిష్క్రమిస్తుంది.
బుసలు కొడ్తూ అవమానం మిగతాదాన్ని వశపరుచుకుంటుంది.

ఎక్కడ అప్పుడు ఆశ, భయాలు, తమ లక్ష్యాన్ని కనుగొంటాయి?
నిలిచిపోయిన మనసును మందగమనపు సంశయం కలుషితం చేయగలదా?
అసహాయుడైన మనిషి అమాయకంగా నిద్రపోగలడా?
విధి వరదలో చీకటి మాటున కొట్టుకుపోతాడా?
అయిష్టత హెచ్చరికలై, ఏ కోర్కెలూ పెరగవా!
ఏ ఏడ్పులూ ఆకాశపు కరుణను అర్థించవా?

విచారించేవాడా, ఆగు, విజ్ఞప్తులు అలాగే ఉన్నాయి.
స్వర్గం వింటుంది, మత బోధలు వృథాకావు.
మంచికోసం విశ్వాసి గొంతు పైకెగుస్తుంది.
ప్రతిఫలపు రూపాన్ని స్వర్గానికి వదిలివేయి.
సుదూరం చూడగల అతడి రక్షణలో నీవు హాయిగా ఉంటావు
అతడిని ప్రార్థించు భక్తిశ్రద్ధలతో,
సహాయాన్ని అర్థించు, అతడి నిర్ణయాలను పాటించు.
అతడు అనుగ్రహించినది గ్రహించు, అతడే ఇవ్వగలడు ఏదైనా!
ఎప్పుడైతే అతడి పవిత్ర ఉనికి అగ్నిలా లభ్యమవుతుందో
నీలో అద్భుతమైన భక్తిభావన నింగినంటుంకుంటుంది.
ఆరోగ్యకరమైన మనస్సు కోసం ఉత్సాహాన్ని పరుగులు తీయించు,
విధేయులైన ఉద్వేగాలతో, సడలిన పట్టుదలతో!
ప్రేమకోసం పరితపించు,
సహనంతో చెడును అధిగమించు,
విశ్వాసంతో ఉన్నత స్థానాన్ని అభిలషించు.
ప్రకృతి సహజ గుణం నిన్ను వెనుదిరగమన్నపుడు శిరసావహించు.
ఇవి మానవుడి కొరకు స్వర్గం జారీచేసిన ఆజ్ఞలు.
ఇవి దేవుడిచ్చిన వనరులు, నీవు లాభపడేందుకు నిధులు.
ఈ దివ్యజ్ఞానం నీ మనస్సుకు ఇస్తుంది ప్రశాంతత.
మనసుకు దొరకని ఆనందాన్నిచ్చే సంతోష ప్రదాత.

– శామ్యూల్ జాన్సన్
(Samuel Johnson 1709-1784)

✧✧✧✧✧

థామస్ గ్రే

(Thomas Gray 26-12-1716 to 30-7-1771)

థామస్ గ్రే ఇంగ్లీషు కవి, లేఖా రచయిత, విద్వాంసుడు, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాచార్యుడు. అతడి ప్రఖ్యాత రచన ఈ Elegy written in a Country Church yard (1751). 1742లో మొదలు పెట్టినా 1750లో పూర్తిచేయబడిన ఈ స్మృతిగీతం (Elegy) ప్రచురింపబడిన వెంటనే అత్యధిక ప్రజాదరణకు నోచుకున్నది.

The Path's of glory, Celestial fate, Some mute inglorious Milton, Far from the Madding Crowd, The unlettered Muse, Kindred Spirit లాంటి పదబంధాలు ఆంగ్లభాషలో శాశ్వతంగా ఉల్లేఖించబడిన పదాలుగా పేరుతెచ్చుకున్నాయి.

స్మృతిగీతం (Elegy) – మృత్యువును, మరణానంతర జీవితాన్ని వర్ణించే ప్రక్రియ. తన మేనత్త Mary Antrobus సమాధిని దర్శించినాక ఈ కవితను థామస్‌గ్రే వ్రాసినాడంటారు. మరణానంతరం అతడి సమాధి కూడా అదే ప్రదేశంలో నిర్మితమైనది.

'Where ignorance is Bliss, it is folly to be wise' అనే సూక్తి అందరికీ తెలిసినదే. థామస్‌గ్రే ఉద్వేగం, అగ్ని కలగలిపిన భావాలతో ప్రశాంతతను, మానసిక సంఘర్షణను తెలిపే కవితలను కూడా వ్రాసినాడు.

Grave yard poets (Oliver Gold Smith, William Cowper, Christopher Smart) లో ఒకడిగా ప్రసిద్ధికెక్కిన Thomas Gray – అభిప్రాయం ప్రకారం– 'The language of the age is never the language of the poetry'.

1. స్మృతి గీతం

(Elegy Written in a Country Church Yard)

విడిపోయే దినపు ఘంటారవాల్ని నిశ్శబ్దం ఆక్రమించుకున్నది
మరలివస్తున్న పశువుల అంబా రావాలు మైదానంపై నెమ్మదించినవి
అలసిసొలసిన రైతు ఇంటి మార్గాన్ని పట్టినాడు
ఈ ప్రపంచాన్ని చీకటికి, నాకు వదిలినాడు.

మసక మసకగా మెరుస్తున్న దృశ్యం అదృశ్యమవుతున్నది.
గాలి, వాతావరణం కాసేపు స్తంభించినట్లున్నది.
అప్పుడప్పుడు బీటిల్ పురుగులు ఎగుర్తున్నాయి.
జోగుతూ చేసే శబ్దాలతో దూరపు నెలవులను జోకొడ్తున్నాయి.

దూరంగా 'ఐవీ' తీగెలు చుట్టుకున్న బురుజు,
గుడ్లగూబ చంద్రుడితో చేస్తున్నది ఫిర్యాదు,
–'నా రహస్య స్థావరం వేపు రావద్దు,
నా ప్రాచీన ఒంటరి రాజ్యాన్ని తాకవద్దు'–

మొండిబారిన 'ఎల్మ్' చెట్ల కింద, 'యూ' చెట్ల నీడలో
శిథిలాల గుట్టలలో నిశ్వసిస్తున్నది పచ్చిక.
ఎవరి ఇరుకు గదిలో శాశ్వతంగా వాళ్లు
నిద్రిస్తున్నారు ఆ కుగ్రామపు తండ్రులు, తాతలు.

పరిమళాల ఊపిరితో ఉదయపు వేకువగాలి పిలుపు
గుడ్డి కుటీరం నుంచి స్వాలోపక్షి అరుపుల మేలుకొలుపు
కోడిపుంజు కొక్కొరోకొ, కొమ్ములున్న జంతువుల అరుపుల ప్రతిధ్వనులు
దిగువనున్న శయ్యల నుండి వారిని మేల్కొలుపలేవు.

వారికోసం ప్రజ్వరిల్లదు ఇంటిలోని నెగడు
తీరికలేని గృహిణి తన సాయంకాలాన్ని వెచ్చించదు
నాన్న వచ్చాడని పిల్లలు పరుగు పరుగున గుమికూడరు
అతడి మోకాళ్లపై ఎక్కి ముద్దులకై పరితపించరు.

కొడవలి కోతకు తరచుగా పంట తలొగ్గుతుంది.
మొండి నేలలు కూడ నాగేటి కర్రు తీవ్రతకు లొంగుతాయి
ఎద్దుల్ని, ఆవుల్ని పొలాలకు తోలుతూ ఎంతో హుషారుగా ఉండేవాళ్లు!
వాళ్ల బలమైన దెబ్బలకు తలవంచేయి అడవులూ, ముళ్ళపొదలూ

వారి శ్రమను ఆశయం పరిహసించనీయకు–
ఇంటికే పరిమితమైన ఆనందాలు, అస్పష్టమైన ముగింపులు
తృణీకరించే చిరునవ్వుతో ఆడంబరాన్ని విననీయకు–
నిరుపేదల స్వల్ప సాధారణ జీవిత పాఠాలు.

ప్రభువుల గప్పాలు, అధికారపు ఆడంబరాలు
అసమాన అందాలు, అంతులేని సంపదలు
అన్నీ ఒకేలాగే వేచిచూస్తాయి ఆఖరి ఘడియకోసం
కీర్తి ప్రఖ్యాతుల మార్గాలన్నీ దారితీస్తాయి స్మశానానికే, నేస్తం.

గర్విష్ఠులారా, మీకూ ఈ లోపాలు వర్తిస్తాయి చివరకు.
సమాధుల జ్ఞాపకాలు బహుమతులనేమీ ప్రకటించకపోయినా
పొడుగాటి మార్గాలు, అలంకరించబడిన గోడలు
మెచ్చులూడిపోతున్న జాతిగీతాలు ఉబ్బిస్తాయి పొగడ్తలు.

కథలుగా మారిన అస్థికల కలశమో, ప్రాణం పోసుకున్న విగ్రహమో
తన భవనంలోకి, పోయిన ఊపిరిని, తీసుకురాగలవా?
గొప్పగొప్ప బిరుదుల స్వరాలు నిశ్శబ్దపు ధూళిని మేల్కొల్పగలవా
పొగడ్తలు, మృత్యువుచే శీతలమై మూసుకున్న చెవులను తెరిపించగలవా

బహుశా నిర్లక్ష్యం చేయబడిన ఇచ్చోట పడిఉన్నదేమో
దివ్యాగ్నితో జ్వలితమైన ధీశాలి హృదయమో
ప్రపంచాన్నేలిన రాజదండాన్ని చేబూనిన హస్తద్వయమో
ఆనందంలో నడచి ప్రాణం పోసుకున్న వీణా వాయిద్యమో.

వారి కనులకు కనిపించెనో, లేదో విజ్ఞానపు విశాల పత్రం
కాలం కొల్లగొట్టిన సంపదలతో నిండి, పుట తిప్పని చిత్రం
ఉన్నతమైన ఆగ్రహాన్ని చల్లబరచిన శీతల దారిద్ర్యం
ఆత్మయొక్క స్నేహ ప్రవాహాన్ని గడ్డకట్టించినదా సముద్రం.

స్వచ్ఛమైన మణికాంతుల ప్రశాంత ప్రకాశం
సముద్రపు, లోతు తెలియని చీకటిగుహల నివాసం
ఎవరూ చూసి ఆనందించని వివిధ వర్ణ పుష్ప వికాసం
ఎడారి గాలిలో వృధాగా మధుర మకరంద ప్రవాహం.

ఏ కుగ్రామపు మట్టిలో 'హాంప్‌డెన్' పడి ఉన్నాడో
ఎదురులేని నియంతగా తానేలిన ఊళ్లూ పొలాల్లో!
కొందరు మూగ మిల్టన్‌లు ఇక్కడే విశ్రమించి ఉండవచ్చు
తన దేశపు రక్తమంటని దోషరహిత 'క్రామ్‌వెల్'లు కూడా!

శాసన సభలు అభినందిస్తూ జారీచేసిన నాయకత్వపు హోదాలు
బాధల భయాలు, తనకు నచ్చని విధ్వంసకర దృశ్యాలు
నవ్వులొలికే నేలపై అమితంగా వెదజల్లడాలు
దేశం, జాతి కనులతో చరిత్రను చదవడాలు.

కొన్ని నిషేధింపబడినాయి, కొన్నిటికి విధించబడినాయి పరిమితులు
సద్గుణాలు కీర్తింపబడినాయి, దాచిపెట్టబడినాయి నేరాలు
సింహాసనానికి ఊచకోతతో రావడం నిషేధించబడినది
మానవజాతికి దయాద్వారాలు మూసివేయబడినవి.

చేతనలో ఉన్న సత్యపు కొట్టుమిట్టాడుతున్న కోరలను దాచి
అమాయకత్వపు సిగ్గుమెరుపుల దాహం తీరుస్తారు.
ఆడంబరం, గర్వపు దేవాలయాల్లో గుట్టలుగా పోస్తారు
మ్యూజ్–సరస్వతీ జ్వాలతో వెలిగించబడిన సుగంధ ద్రవ్యాలను

లజ్జాపూరితమైన కష్టాలననుభవించే ఉన్మత్త గుంపులకు దూరంగా,
వారి అర్థవంతమైన కోరికలు పక్కదారులు పట్టవేనాడూ.
చల్లని ఏకాంతపు జీవనలోయలో ప్రయాణిస్తూ
వారి మార్గంలోకి శబ్దం చేయని అతిథిని దూరంగా ఉంచుతారు.

అస్థికలను కూడా అవమానానికి దూరంగా ఉంచడానికి
ఏదో బలహీనమైన స్మృతి చిహ్నాన్ని నిర్మిస్తారు
ఇంపులేని ప్రాసాకవిత్వం, రూపులేని శిల్పాలతో అలంకరణం
నిట్టూర్పు, పలికిన నివాళితో మామూలుగా ముగిస్తారు.

వారి పేరూ, కాలం పేరులేని కవి పలుకుతాడు
దొరికిన ప్రసిద్ధ ప్రదేశం, స్మృతిగీతాన్ని చేరుస్తాడు
దాని చుట్టూ పవిత్రమైన కథలల్లుతారు
మింగుడుపడని మొండి నీతిమంతుడికి చావడం నేర్పుతారు.

ఎవరికైతే మూగ మతిమరుపు ఆహారమౌతుందో, వారిని
ఈ సంతోషపెట్టే విధానం సమాధానపరుస్తుంది.
ఆనందపు ఘడియల వెచ్చని ప్రదేశాల్ని వదిలి వెళ్లినవాళ్లు
వెనక్కి తిరిగి ఒక దీర్ఘపు, కలయ చూసే, చూపునెందుకు చూడరు?

వెడలిపోతున్న ఆత్మ తన కిష్టమైన హృదయాన్ని నమ్ముతుంది.
మూతబడ్తున్న కన్ను స్వచ్ఛమైన కొన్ని నీటిచుక్కల్ని కోరుకుంటుంది.
సమాధి నుంచి కూడా ప్రకృతి స్వరం అరుస్తుంటుంది
మన బూడిదలో కూడా వాటి సహజ అగ్ని రగుల్తుంటుంది.

ఎవరైతే గౌరవం పొందని మృతుల గురించి ఆలోచిస్తుంటారో
ఈ వాక్యాలలో వారి కళాహీనమైన కథ ప్రస్ఫుటమౌతుంది.
అవకాశం వస్తే, ఒంటరి ధ్యానం అటువేపు తీసుకువెళ్తుంది
ఎవరో రక్తసంబంధీకుడైన ఆత్మ నీ విధివ్రాత గురించి అడుగుతుంది.

బహుశా, అటుగా వెళ్తున్న గ్రామీణుడంటాడు–
–'అడపా దడపా సంధ్యాసమయంలో మేం చూసామతడిని
పొగమంచును తోసుకుంటూ వడివడిగా నడవడం
పై మైదానంలో సూర్యుడిని కలుసుకునేందుకేమో'–

'దూరంగా, తలలూపుతున్న బీచ్ చెట్ల అడుగున, ఎక్కడైతే
వాటి అద్భుతమైన వేళ్లు ఎత్తుగా అలంకరించబడి ఉంటాయో అక్కడ
మధ్యాహ్నం పూట, అతడి గణించని ఎత్తును సాగదీస్తూ
పక్కనే గలగలా పారుతున్న ఏటిపై కుమ్మరిస్తుంటాడు.

ఆ అడవి పక్కనే, తిరస్కారంలోనూ చిరునవ్వు నవ్వుతూ
తన దారితప్పిన ఊహాగానాల్ని గొణుక్కుంటూ ఉంటాడు.
దిగులుతో కుములుతున్నవాడిలా, ఒంటరిగా, భుజాలు వేలాడేసి,
ఆలోచనలతో పిచ్చెక్కినవాడిలా, ఫలించని ప్రేమికుడిలా అతడు.

ఒక ఉదయం పూట నేనతడిని యధావిధిగా కొండవద్ద కలవలేదు
ఆ చిట్టడివి మైదానంలోనూ, ఆ చెట్టు వద్ద కూడా!
తరువాత రోజునా కలవలేదు, ఆ ఏటిపక్కనా,
పచ్చిక బీడులోనూ, ఆ అడవిలోనూ అతడు కలవలేదు.

ఆ తరువాత విషాదపు పొరల మధ్య విలాపగీతం విన్నాము.
చర్చికి వెళ్లే దారిలో అతడు మళ్లీ జన్మించడం చూసాము.
అక్కడికి వెళ్లి చూసాము, చదివాము (నీవు చదవలేకపోయినా)
వయసు పైబడిన ముళ్లచెట్టు కింద శిలాఫలకంపై వ్రాయబడిన దానిని.

స్మృతి లేఖనం

నేల ఒడిలో ఇతడి శిరస్సు ఉంచబడినది
అదృష్టానికి యువకుడు, కీర్తికి అనామకుడు.
అందమైన శాస్త్రం అతడి సాధారణ పుట్టుకను తిరస్కరించలేదు.
విషాదం అతడిని తన స్వంతవాడిలా ఎన్నుకున్నది.

అతడి దయ చాలా గొప్పది, అతడి ఆత్మ నిజాయితీ గలది
స్వర్గం కూడా అతడికెంతో ఎక్కువగా చెల్లించినది.
పేదరికానికి తానివ్వగలిగిన 'కన్నీటిబొట్టు' నిచ్చినాడతడు
స్వర్గం నుంచి తాను పొందిన ఒకే ఒక స్నేహితుడు.

అతడి గొప్పదనానికై అక్కడెక్కడో దూరంగా వెదకకు,
భయంకరమైన స్థలం నుంచి అతడి బలహీనతలను వెలిదీయకు.
(అక్కడ అవన్నీ ఆశతో ఒకేలా విశ్రాంతి తీసుకుంటూంటాయి)
తన దేవుడు, తన పితరుడి హృదయంలో అతడున్నాడు.

– థామస్ గ్రే

(Thomas Gray 1716-1771)

✧✧✧✧✧

విలియం కాలిన్స్

(William Collins 1721-1759)

విలియం కాలిన్స్ ఆంగ్లకవి, దాదాపు థామస్ గ్రే అంత ప్రాచుర్యాన్ని పొందినవాడు. పద్దెనిమిదవ శతాబ్దపు మధ్య దశాబ్దాలలో ముఖ్యకవిగా, ఆగస్టన్ కవిత్వానికి (Alexander Pope తదితరులు), తరువాత భావవాద తరానికి (Romantic era) కు మధ్యకాలం వాడు.

Ode's on Several descriptive and Allegorical Subjects, Persian Eclogues, Ode on Death of Thomson, Ode on the Popular Superstitions of the Highlands ఇతడి ప్రసిద్ధ రచనలు. ఆనాడు ఆదరణకు నోచుకోకపోవడంతో దిగులుకు లోనై, తాగుబోతుగా మారి, ఉన్మత్తుడైనాడు.

ప్రకృతి కవితలుగా ప్రసిద్ధికెక్కిన– Thomson's - The Seasons (1730), Warton's- The Love of Nature (1744), Collins - The Ode Evening కవితలు తరువాత వచ్చిన భావవాద కవిత్వానికి Prelude - స్వాగత గీతాలుగా భావించబడినాయి.

ప్రాస లేకుండా ప్రాస ఉన్న భ్రాంతిని కలిగించి లయబద్ధంగా సాగే కవిత్వాన్ని మిల్టన్ తన గీతాల్లో (Odes) వాడినాడు. విలియం కాలిన్స్ తన ode to Evening లో Chaste Eve, Solemn Springs, Heedless hum, Weak eyed bat, Leathern wing, Sheety lake - లాంటి పదబంధాలతో రెండు పెద్ద వాక్యాలు, రెండు చిన్ని వాక్యాలతో ఓ మార్మికమైన అనుభూతిని, తన Dewy fingers తో Dusky Veil ను కవితపై ఆచ్ఛాదన చేసి ఒక అజరామరమైన కవితను మనకందించినాడు.

1. సాయంకాలపు గీతం

(Ode to Evening)

ఏదైనా ఓట్ల ధాన్యపు పొలం దగ్గర ఆగు, కర్షక గీతం విను
నూతన సంవత్సరారంభపు ఆశ నీ వీనులకు మృదువుగా తాకనీ!
నీలో ఉబికే స్వంత జలధారల్లా
నీటి ఊటలు, సమసిపోతున్న మలయమారుతాలు జాలువారనీ!

ఓ మార్మిక కన్యా! మెరిసే శిరోజాల సూర్యుడిప్పుడు
పడమటి గుడారంలో పరివేష్ఠితుడై ఉన్నాడు. అతడి
మబ్బుల చొక్కాలు ఆకాశంలో నేయబడి
తరంగాల శయ్యపై నుండి వేలాడుతున్నాయి క్రిందకు.

ఇప్పుడు గాలి నిశ్శబ్దమయ్యింది, ఒక దృష్టిదోషపు గబ్బిలం
సన్నటి ఈల గొంతుతో కీచుమంటూ చర్మపు రెక్కలపై
ఎగుర్తున్నది, బీటిల్ కీటకం
తన మూర్ఖపు కొమ్ముబూరను సవరిస్తున్నది.

తరచుగా అది పైకి ఎగుర్తుంది, సంధ్యాకాలపు దారిలో
అదుపులేని హుంకారపు ధ్వనిలో జనించిన బాటసారికి
వ్యతిరేకంగా, ఇప్పుడది నన్ను చేరుకున్నది, ప్రశాంతపు కన్య,
మృదు మధుర స్వరాన్ని నిశ్వసిస్తూ.

ఎవరి లెక్కలూ, చీకటి కమ్ముకుంటున్న లోయలలో,
ఆ నిశ్శబ్దానికి సరిపడినంతగా లేవని అనిపించవు!
నింపాదిగా కవిత్వీకరిస్తూ, నేను, నీ సరసమైన
ప్రేమ రాకడను ప్రస్తుతిస్తాను.

ఎప్పుడైతే నీ రెక్కల నక్షత్రం ఉదయిస్తూ చూపిస్తుందో
అతడి పాలిపోయిన వలయాన్ని, అతడి హెచ్చరికా దీపం వద్ద,
పరిమళ ఘడియలు, పగలంతా
మొగ్గలలో నిద్రపోయిన పూలకన్యలు.

ఎందరో అప్సర కన్యలు తమ కనుబొమలపై రెల్లుపరకలను
అలంకరించుకుని, మంచు బిందువుల్ని జాలువారుస్తూ, ఇంకా
అందంగా కనిపిస్తున్నారు, ఆనంద మాధుర్యపు
వ్యాకులత వారి నీడల రథాన్ని సిద్ధం చేస్తున్నది.

దారి తీయుము, ఓ ప్రశాంత సేవికా, ఎక్కడైతే అలల సరస్సు
ఒంటరి మైదానాన్ని ఆనందపరుస్తుందో అక్కడకు! కాలగమనంలో
పూజనీయమైన గుట్ట లేదా కొండప్రాంతపు బీడు భూములు
నల్లగా ప్రతిఫలిస్తాయి దాని ఆఖరి చల్లని కిరణాల్ని.

చల్లగా వణికించే గాలులు, లేదా పరుగులెత్తే వర్షాలు
అంగీకరించిన నా పాదాలను ఆపుతాయి, ఆ కుటీరం నా స్వంతమై
ఆ పర్వతం పక్కనే ఉన్నటువంటిది, దాని నుంచి
కనిపిస్తాయి ఘోరారణ్యాలు, పొంగుతున్న వరదలు.

గోధుమరంగు కుగ్రామాలు, చీకటి కమ్ముకున్న శంకువులు
వాటి నుంచి వినిపిస్తున్న మంద్ర ఘంటికానాదాలు, అన్నిటినీ
గుర్తింపచేస్తాయి, నీ పొగమంచు అంగుళిలు గీస్తాయి,
క్రమేపీ విస్తరిస్తున్న మసక చీకటి తెరను.

వసంతకాలం తన వంతు వర్షాలను కురిపిస్తుంది, తరచుగా
కురిపించదు, కానీ నీ శిరోజాల ఊపిరిలో స్నానమాడ్తుంది.
సాధుకన్యా, వేసవి, నీ కదిలే కాంతుల క్రింద
ఆటలాడడాన్ని ప్రేమిస్తుంది.

వివర్ణ వదనపు ఆకురాలు కాలం నీ ఒడిని ఆకులతో నింపుతుంది.
శీతాకాలం, ఆయాసకరమైన గాలుల్తో అరుస్తూ
భయపెడ్తుంది నీ కృశిస్తున్న పరివారాన్ని,
మొరటుగా చించుతుంది నీ వస్త్రాల్ని.

నీ శీఘ్ర పరిపాలనకు కృతజ్ఞతగా, చిరకాలం,
ఊహలు, స్నేహం, శాస్త్రం, గులాబి పెదవుల ఆరోగ్యం
నీ అత్యంత మృదువైన ప్రభావాన్ని పొందునుగాక!
నీకిష్టమైన నామం ప్రముఖంగా కీర్తింపబడును గాక!

– విలియం కాలిన్స్

(William Collins 1721-1759)

✧✧✧✧✧

క్రిస్టఫర్ స్మార్ట్

(Christopher Smart 11-4-1722 to 21-5-1771)

క్రిస్టఫర్ స్మార్ట్ – కిట్టీస్మార్ట్, కిట్‌స్మార్ట్, జాక్‌స్మార్ట్‌గా పిలువబడిన ఆంగ్లకవి.

'మిసెస్ మేరీ మిడ్‌నైట్'గా, మానసిక ఉద్వేగాలకు లోనై మానసిక శరణాలయంలో బంధించబడిన వాడిగా, విడుదలైన తరువాత అప్పుల ఊబిలో చిక్కుకుని మరల జైలుపాలై మరణించేంత వరకు Debtor's Prison లో ఉన్నవాడిగా అపకీర్తి పాలైనాడు.

A Song to David, Jubilate Agno ఇతడికి పేరుతెచ్చిన కవితలు. The Mid Wife, The Student పత్రికలకు సహరచయితగా, The hop garden, The Hilliad, Senator Prize poems లాంటి పేరు పొందిన కవితలకు రచయితగా చిరస్మరణీయుడైనాడు.

ఏడేళ్లు మానసిక శరణాలయంలో ఉన్నపుడు అతడికి కాగితం, కలం ఇవ్వకపోవడంతో, తాళపు చెవి మొనతో ఈ కవితను తన కోటుపై నొక్కి వ్రాసినాడంటారు. (March 1759 - August 1760) ఉన్మత్తుడి గీతంగా, గ్రీకు అక్షరాలను (ఆల్ఫా, గామా, ఈటా, తీటా, అయోటా, సిగ్మా, ఒమేగాలను) ఇముడ్చుకున్న మార్మిక గీతంగా, దైవభాషకు మానవ కవిత్వానికి వారధి లాంటి పాటగా A Song to David నేడు విమర్శకుల మన్ననలనందుకుంటున్నది. సాధారణ స్థాయిలో మొదలై పతాకస్థాయిని చేరుకునే ముగింపు వేగం ఈ కవితలో అద్భుతంగా కానవస్తుంది.

1. డేవిడ్ పాట

(A Song to David)

ఓ నీవు, సింహాసనంపై కూర్చుని
మహత్తరమైన వీణను చేబూని
ప్రభువులకు ప్రభువును కీర్తిస్తున్నావు.
స్వర్గాన్ని అందుకునేలా ఉబికే కంఠస్వరంతో
లోతైన మార్మిక స్వరాలతో
స్పష్టంగా, క్లారియాన్ కొమ్ము బూరలా, మ్రోగుతున్నావు.

ప్రతి లోయను, వనాన్ని, తీరాన్ని ఆశీర్వదించేందుకు
గంధర్వులైన ఖెరుబ్‌లను సమ్మోహనపరచి
కృతజ్ఞతా స్థానాల వద్ద గుమికూడేట్లు చేస్తున్నావు;
జియాన్ శిఖరంపై దినాల్ని లెక్కిస్తూ
సంవత్సరాన్ని పంపుతావు అతడి ఖాతాలోకి
నృత్యగానాలతో.

ఓ దైవ సేవికుడి పవిత్ర తేజమా!
పొగడ్తలకు దూరంగా ఉండే నైజమా
ఇప్పుడు నీవు స్వీకరించగలవు
నీ ఆశీర్వదించబడిన భవనం నుండి జేజేలను
అత్యున్నత స్థానము నుండి చూడగలవు
నేను నేస్తున్న ఈ పూలమాలికను.

ఘనత, సాహసం, భక్తి, మంచితనం, శుభ్రత
మహనీయత, ధ్యానము, ప్రశాంతత
బలం, స్థిరత్వం, ఆనందదాయకం, వివేకము!
అధికమైన కరుణ యొక్క నిర్గత ప్రకాశము.
గొప్ప మనిషీ! – వేగము, పరుగు పందెము,
అపాయము మరియు బహుమతి స్వీకారము!

అతడి కిరీటపు కాంతి వలన కలిగిన ఘనత
శామ్యూల్ బాకా నుంచి, దేవుని కీర్తి నుంచి,
అదే ప్రజాస్వరము.
సమస్త సైనిక సమూహము, వెనుక నుంచి ముందుకు
అభినందనలు, కౌగిలింతలు ఆ మానవుడికి
దేవునిచే ఎన్నిక చేయబడిన అతడికి–

సాహసం – ఆ మాట – అతడికే సార్ధకం
యుద్ధం – శత్రువులపై విజయ విహారం
దేవుడి న్యాయాలను వ్యతిరేకించిన వారిపై,
అచంచల విశ్వాసంతో విరుచుకుపడినాడు
దంభాలు పలికే వాళ్లపై, చిన్ని గది నుంచి
యుద్ధపు ఆయుధాలను తెచ్చినాడు

దైవభక్తి – అద్భుతమైనది, ఘనమైనది
గొప్ప దేవాలయాన్ని నిర్మించ తలపోసినాడు
(అతడి ఆత్మలో– సెరాఫ్–దేవదూత)
దేవుడికి తన ఋణం చెల్లిస్తాడు అందరికన్నా ముందు
స్వాగతపు వార్తలను ముందుగా ఆశీర్వదించేదతడే,
అలాగే, విషాదాన్నీ ప్రకటిస్తాడతడు ముందుగానే!

మంచితనం– జెహుదా సరియైన విధానం
దేవుని మంచితనం ప్రకటింపబడిన రేణువు
అతడి అంశ, అతడి హృదయం,
జాలి, క్షమ, రక్షణ,
చేతనా గుహలో సాక్షులు,
షైమీ మొక్కవోయిన బాణాలు.

శుభ్రత– నిత్యమై, శాశ్వతమైన ప్రార్థన స్వచ్ఛమై
ప్రేమ, తనకు తాను అలవరచుకుంటుంది
ఉపవాస దీక్షను, భయపడడాన్ని–

సంజ్ఞలలో, హస్తాలలో, పాదాలలో
వీణను అణచి, నృత్యాన్ని పూర్తిగానూ,
కత్తి, బల్లెం కదను తొక్కుతాయి.

మహనీయత– నిత్య యవ్వన జీవనము
విశాల భావం, ఉన్నత భాషణం
దేవుని కొరకు శాశ్వత వస్తు విషయం
ఉద్వేగ పారవశ్య స్వరాలను సంగ్రహించడం
ఆలోచనలో పోటీలేని రాజసతత్వం
సాధారణ అభివ్యక్తి కన్నా ఉన్నతంగా ఉండడం.

ధ్యానము– దేవునిపై మనసు నిలపడం
పై షట్క్రియలను పాటించడం
సబ్బాత్ రోజున ఆశీర్వదించబడడం
అప్పుడతడి స్వంత గెలుపు ఆలోచనలు కత్తిరించబడి
మిగతావి భరించే ఆశీస్సులు లభిస్తాయి.
స్వర్గలోకపు విషాద స్వరం ధ్వనిస్తుంది.

ప్రశాంతత– శాంతి విత్తనాలను నాటి
అతడు గొర్రెలను కాచిన రోజుల్ని
క్రిడాన్ లోయ అంచును గుర్తు తెచ్చుకోవడం–
శాశ్వత స్వర్గాన్ని మొక్కగా నాటి
మరింత జ్ఞానాన్ని పొందడం, చెడు అలవాట్లను నిర్జించడం
దేవుడు ప్రపంచాన్ని ప్రశాంతంగా ఉంచినపుడు.

బలం– ప్రభువును సాతానును తృణీకరించిన
మహాశక్తిమంతుడిని, శాశ్వత రాత్రిలో
నిబిడీకృతమై శక్తులు కలిగిన వాడిని,
నరకాన్ని, భీకర దృశ్యాల్ని, నిరాశను నిలువరించే

సింహం, ఎలుగుబంటిలా
తన అసమాన శక్తికి ప్రతీకగా-

స్థిరత్వం- దేవునిపై అచంచల ప్రేమతో
సత్యం, వయస్సు, బాల్యం, యవ్వనం, కౌమారం-
తన స్నేహితుడైన జోనాథన్‌కు
అన్నివేళలా, మృత్యు సరిహద్దుల దగ్గర
జీబా, మెఫిబోషెత్‌లా
అతడి అనంత కీర్తిని సేవించడం.

ఆనందదాయకం- ఏడాదిలో వివిధ రకాలుగా
మనిషి, ఆత్మ, దేవదూత, సాటిలేనివాడు
పూజారి, విజేత, సాధువు, బాలుడు.
యుద్ధ కవచం గాని, చేతులు లేని ఇఫాడ్ అంగీ గాని ధరించి
అతడి ఆడంబరం, అతడి దైవభక్తి సంతోషకరమై
అతడి సంతోషం రాజసమై గంభీరమైనది.

వివేకము- పతనమైనా తిరిగి నిలదొక్కుకోవడం
మరల తన పూర్వస్థితిని తెచ్చుకోవడం
అందరితో నిందావాక్యాలు పడినా;
తన మార్గంలోకి ఇజ్రాయెల్ వెలుగును తెచ్చుకుని
అతడి సూక్తులు, ప్రార్థనలు, పొగడ్తలు, వివేకంతో కూడినవై
తన పిల్లలను సన్మార్గంలో నడిపించడం.

....

ఆరాధన కోసం అందరు
దేవదూతలు తెలుపుతారు శాశ్వత కృతజ్ఞతలు-
వారి మధ్యలో దేవిడ్
దేవుడి సజ్జన పేదలతో, కట్టకడపటకు,

మానవుని దృష్టిలో, నీవు ఆ విందుకు,
ఓ ఆశీర్వదింపబడిన వరుడా, పిలువబడినావు

ఆరాధన కోసం ఋతువులు మార్తాయి
క్రమపద్ధతి, సత్యం, అందపు శ్రేణి
సర్దుబాటు, ఆకర్షణ, నింపబడడం
పాలియాంథస్ పచ్చిక వివిధ రకాల వర్ణాల గళ్లు
మెరుపు పెట్టబడిన పార్ఫిరి చలవరాళ్లు
దిగువకు పోతున్న సెలయేటి పక్కన–

ఆల్మండ్ ఫలాల పక్వపు రంగులు
ఆరాధన కోసమే, పాకుతాయి తీగ మొక్కలు
పండ్లచెట్లు ప్రతిజ్ఞ చేస్తాయి రత్నాలు
'ఐవిస్ పక్షి ప్రదర్శిస్తుంది అద్భుతమైన అంగీని
తన గుడ్ల కోసం జిత్తులమారి గూటిని,
గంట పుష్పాలు వంచుతాయి తమ కొమ్మలు.

దేవదారు వృక్షాలు ధారగా చిమ్ముతాయి మధుర రసాన్ని
కఠిన శిలల నుండి వేగంగా ప్రవహిస్తుంది స్వచ్ఛమైన తేనె.
ఆరాధన కోసమే నీటి ఊటలు
అనేక దృశ్యాలు ప్రకృతి పటంపై చిత్రించబడ్డాయి
సముద్రకన్య మెర్‌మెయిడ్ చనుమొనల నుంచి
పొలుసుల శిశువు పాలు చీకుతుంటాడు.

మచ్చల పులి, ఆటలాడే పులిపిల్లలు
పూల పొదల మధ్య పరుగులు తీస్తుంటాయి
తొండలు పాకుడును తింటాయి
ఆరాధన కోసం జంతువులు ఓడ ఎక్కుతాయి
హాల్సియాన్ నావను పైకెత్తి పట్టుకున్న అలలు
ఇక ఏమాత్రం గర్జించవు, ఎగసి పడవు.

మర్రిచెట్టు కింద ఇజ్రాయెల్
పగడాల వేళ్లు, పసుపు ఆకుల చెట్టు
యుద్ధాన్ని విడిచిపెట్టిన వీరుడు
ఆ చేతుల్లో మల్లెలు విచ్చుకుంటాయో
ఆకుల మధ్య ఆరాధనకై
గాలి అతడి శాంతి ప్రకటనను చదువుతుంది.

ఎక్కువరోజులు వాటి పరిపాలన పొడిగించబడ్తుంది.
ఎరుపు, మచ్చల గోపురం కింద కాదు
వ్యతిరేకించే ఆత్మల వేపు ఒరుగుతుంది
తీరపు చిన్నినౌకలు గూఢచారిత్వం చేస్తుంటాయి
వెండి నాణాలు, చిల్లరా జారిపోతుంటాయి
ఆరాధనకై బంగరు పూత పూయబడినట్లు

ఆరాధనకే, పక్వానికి చెరుకుగడలు
కొకొవా స్వచ్ఛమైన పాలు
పశ్చిమ దేశ యాత్రికుడి చేతికర్ర
ఎక్కడైతే వర్షాన్ని చెట్ల శాఖలు దోసిళ్లుగా పట్టుకుంటాయో
నారింజలతో సహా తీగలు తీసివేయబడతాయో
అక్కడ అడవి పొదలు నవ్వులు విరజిమ్ముతాయి సామూహికంగా

అతడి శ్రమకు ఫలితం దక్కుతుందిప్పుడు
ఆరాధన అతడి పనల్ని లెక్కిస్తుంది.
తన భాగ్యవంతుడైన రాకుమారుడికి ఇస్తుంది శాంతి.
అతడి ముదురు వర్ణం పీల్చుకుంటుంది
పదివేల తెగల ఏపిల్ పళ్లరసాన్ని
వింతైన క్విన్స్ ఏపిల్స్‌తో కలిపి.

తెల్ల బియ్యపు భాగ్యవంతమైన వరిపొలాలు,
థెయిన్ సువాసన అడవులు, సుగంధ వృక్షాల మధ్య

పెరుగుతాయి ఆరాధనకై
కంచె వేయబడిన తోటల్లో పెంచబడ్తాయి
పీచ్ వృక్షాలు, దానిమ్మ చెట్లు
అక్కడ అడవి చేమంతులు విరగబూస్తాయి.

శీతాకాలాన్ని లారెల్ చెట్లు తట్టుకుంటాయి
బ్రహ్మజెముడు మెరుస్తుంది సజీవంగా
మంచు కప్పిన నేలపై
ఆరాధనకై మిర్టిల్ వృక్షాలు
తోటను దిగులు నుంచి రక్షిస్తాయి
చూపులను కరువు నుంచి తప్పిస్తాయి.

ఫీసంటు పక్షి తన అందమైన మెడను చూపిస్తుంది
అడివి తెల్లపిల్లి ఆ మచ్చలను చూసి అసూయ పడ్తుంది
భయం వలన పోట్లాట మానివేస్తుంది.
నలుపు వర్ణం తన అద్దంలా మెరిసే గర్వాన్ని
ఆరాధన కొరకు చెరుపుకుంటుంది
ఎక్కడైతే మంచు అలల్లా గడ్డకడ్తుందో అక్కడ.

చిరునవ్వుల హోల్లీ, ధ్యానమగ్నమైన 'యూ' చెట్లు
పావనమైన ముళ్లచెట్లు, కత్తిరించగా తిరిగి చిగురిస్తున్నవి
ఉడుత తన గింజలను పోగు చేస్తుంది
అన్ని జీవులు తమ నిధుల్ని దాచుకుంటాయి
జాగరూకతతో ప్రకృతి తన తలుపులను
ఆరాధనకై మూస్తుంది.

ఆరాధన కొరకే డేవిడ్ సామగానపు గీతాలు
హృదయాన్ని దానధర్మాల వేపు మళ్లిస్తాయి.
ఎవరైతే మోకరిల్లి మంత్రాక్షరాలు జపిస్తాడో
అతడు తన ఉద్వేగాలను నియంత్రించగలుగుతాడు

మందులు, మాంసాహారం తన ఆత్మకు కనుగొంటాడు.
అది తన వినియోగానికి ఆయాసపడ్తుంది.

ఆరాధన కొరకు, సాటిలేనిదైన
గొప్ప బుల్‌ఫించ్ పక్షి పట్టుకోవాలనుకుంటుంది
మెత్తటి ద్రవీభూత దంతపు స్పర్శను-
హేజెల్ తుంపర్లలో అజాగ్రత్తగా,
సాహసికుడైన రెడ్‌బ్రెస్ట్-ఎర్రరొమ్ము పక్షి దూరంగా ఉంటుంది
తన ప్రియురాలి కాంక్షా స్పర్శకు!

ఆరాధనకై, ఆకాశంలో
దేవుని వేదాంతి నివసిస్తాడు
కుక్క, గొర్రె, గులాబి
గ్రహ వలయం, ఓరియాన్ ఖడ్గం
అతడి ఘనత తక్కువగా కీర్తింపబడదు
మెరిసే మిణుగురు పురుగులోనూ,

ఆరాధన కొరకే తంత్రులపై
పశ్చిమ గాలులు ఎగుర్తాయి రెక్కలపై
బందీ చేయబడిన వీనులకు విందు
విను, ఆ స్వరాన్ని- ఎంత స్థిరంగా, చిన్నగా ఉన్నదో!
అది ఆకాశ గంగను పడవేస్తుంది,
సముద్రాన్ని మృదువుగా చేస్తుంది.

ఆరాధన కొరకే సుగంధద్రవ్యం
పామురాయి గోరోచనం, గుగ్గిలం
అడివి పిల్లి ఉన్ని, పునుగు, జువ్వాజి
ప్రార్థనలలో, మూర్ఛ స్థితులలో
వాటికన్నా పవిత్రమైనది సాధువుల ఊపిరి
సాంబ్రాణి కన్నా, బోళపు బంక కన్నా!

ఆరాధనకే, పాడు పాపాల దిగువ నుండి
ఆనానా కిరీటం వరకు
దేవుడు పంపుతాడు రుచిని, ప్రేరేపించేందుకు
అతి మాధుర్యపు అభిలాష ఆహ్వానిస్తుంది
దృశ్యంలోని ఇంద్రియ స్పర్శ ఆనందపడ్తుంది
కోరికను స్వచ్ఛంగా ఉండమని ఆజ్ఞాపిస్తుంది.

ఆరాధన కొరకే, అన్ని కరుణ మార్గాలూ
తెరచుకుంటాయి, అన్ని స్నాన ఘట్టాలూ,
శుభ్రించబడి ఉంటాయి స్వచ్ఛంగా,
కీర్తి కిరణాలన్నీ కాంతిపుంజాలు కాగా
దేవుడి కృప నొందిన మానవుడిని అలంకరిస్తాయి.
దేహంపై అతడి విజయానికి కానుకగా.

ఆరాధన కొరకే, క్రీస్తు గోపురంలో
పిచ్చుకలు తమ గూటిని నిర్మించుకుంటాయి
అతడి ఆలివ్ చెట్లపై వాలుతాయి.
స్వాలో పక్షి కూడా వాటితో కలిసి తిరుగుతుంది
దేవుని వినయరూపమైన మానవుడా,
నీ రక్షకుని చర్చిలో నీవున్నావు.

అధికమైన ప్రేమతో చేరదీసిన శిశువులు
నిద్రించిన అమాయకపు మధురమైన చిరునవ్వులు
పోగొట్టుకున్నది దొరికినప్పటి మధుర భావనలు
సంగీతజ్ఞుడి ఉద్రేకపు నాదాల మాధుర్యం
అతడి పరాకు మనసు పయనించే మాధుర్యపు దారులు
తేనెపట్టులోకి తెచ్చుకునే ఇష్టమైన పూల తేనెలు.

ప్రేమ సరాగ విరాగాలన్నీ మధురాలే
టర్టిల్ కపోతపు కువకువ భాష

నీ ఉబ్బిన తంత్రితో జతకలిపి;
ఓర్పుతో కూడిన ప్రతి కరుణ మధురమే
నీ కృతజ్ఞతలోని వెలుగు
ప్రభువులోకి, విడిచినది ఊపిరి.

వేగంలో గట్టిది జవనాశ్వం
వేటలో గొప్పది చిన్ని డేగ
త్వరగా తన వేటను ముగిస్తుంది.
నేలపై ఎత్తైనది ఆస్ట్రిచ్ పక్షి
నిగూఢమైన అలజడిలోనూ గట్టిది
గ్లిఫియాస్ గురి చూసి కొట్టగలిగేది.

బొగ్గులా గట్టిది సింహం
బురుజుపై ఎలుకలా అతడి నేత్రం
శత్రువులపై ఉరిమే ఛాతీదర్పం
ప్రయాణంలో గట్టిది నల్లని డేగ
పెను అలలను లెక్కచేయక తిమింగలం
వస్తుంది అలలకెదురుగా స్థిరంగా.

వాటికంటే గట్టివి నేలా, గాలి
సముద్రం, ప్రార్థించే మనిషి
అలలకు చాల దిగువన
విశ్వాసపు పీఠంపై కూర్చుని
అడిగింది దొరికి; కోరినది కనుగొని
తట్టగానే తెరుచుకుంటుంది పూర్తిగా

తుఫానుకు ముందు చక్కగా ఉంటాయి నావలు
మెయిలులో చక్కగా ఉంటారు సమూహాలు
ఆయుధాల శ్రేణులు, శిఖి పింఛాలు
తక్కువ నీడలో అందంగా ఉంటుంది తోట

నడక, నీళ్లు, విచ్చలవిడి మార్గాలు
అనేక పూల శయ్యలు.

ఇంటి ఆవరణలో పడిన అందమైన వెన్నెల
ఇంకా అందమైనది వధువు తన మేలిముసుగును
తీసి వరునికి కనిపించినప్పుడు
అలంకరించబడి, నిండుగా ఉన్న దేవాలయపు అందాలు
స్వర్గాలకు స్వర్గానికి
వాళ్లు హృదయం నింపిన ప్రతిజ్ఞలు చేస్తున్నపుడు.

అందం, వీటికన్నా అందమైనది
గొర్రెల కాపరి ప్రభువు మోకాళ్లపై నిలబడినప్పుడు
అతడి గాఢమైన నమ్మకం
అనంతమైన స్వాతిశయపు కోరిక
మనిషికి, జంతువుకు, మూగగా, చిన్నా, పెద్దా
ధూళి నుంచి ధూళికి సాగిలపడుతూ.

అమూల్యమైనది సంపదలు గల విధవరాలి శిశువు
ఇంకా విలువైనది, ఆనందాన్నిస్తుంది
లోభి నుంచి పొందిన దానం.
అమూల్యమైనది కెంపుల మెరుపు,
ఇంకా విలువైనవి శ్వేతమణి రాజస కిరణాలు
స్వచ్ఛమైన ముదురు నీలి ముత్యానివి.

అమూల్యమైనది పశ్చాత్తాపపు కన్నీరు
విలువైనది నిజాయితీ గల నిట్టూర్పు
దేవునికి అంగీకారమైనదది.
అమూల్యమైనవి మనసు గెలిచే పూలు
సంతోషకరమైన ఇశ్రాయెల్ గూళ్ల విందు
పవిత్రీకరించబడిన పచ్చగడ్డి నేలలందు.

మహిమాన్వితమైనది సూర్యుని మధ్యాహ్నపుటెండ
ఘనంగా కానవస్తాయి గుమికూడిన అగ్నులు
మహిమగలది ఉల్కాపాతపు పరివారం
ఘనమైనది బాకా, మరియు హెచ్చరిక
మహిమాన్వితమైనది అత్యంత శక్తివంతుడి చాచిన చేయి,
ఘనమైనది పారవశ్యపు మేను.

మహిమాన్వితమైనది ఉత్తరకాంతి ప్రవాహము
ఘనమైనది గానం, దేవునిపై వ్రాసిన గీతము.
మహిమగలది ఉరుము గర్జన
ఘనమైనది గది నుండి హోసన్నా ప్రార్థన
మహిమగలది కాథలిక్‌ల ఆమెన్
మహిమాన్వితమైనది మృతవీరుల రక్తము.

మహిమాన్వితమైనది, ఘనమైనది కిరీటము,
ఆ ప్రభువుది, ఆత్మను కాపాడి ముక్తి నివ్వడము,
భగవద్భక్తితో, నమ్రతగా, పిలిచాడు కుమారుడు-
నీవు ఆ అద్భుత సత్యాన్ని విశ్వసించినావు
ఇఇప్పుడు ఆ సాటిలేని కార్యం సాధించబడినది.
నిర్ణయించబడినది, సాహసంగా, పూర్తి చేయబడినది.

- క్రిస్టఫర్ స్మార్ట్
(Christopher Smart 1722-1771)

✧✧✧✧✧

ఆలివర్ గోల్డ్‌స్మిత్

(Oliver Gold Smith 10-11-1728 to 4-4-1774)

ఆలివర్ గోల్డ్‌స్మిత్ ఆంగ్లో ఐరిష్ నవలారచయిత, నాటక రచయిత, కవి. The Vicar of Wakefield (నవల) (1766), The Deserted Village (1770) (కవిత); నాటకాలు– The Good Natured Man (1768); She Stoops to Conquer (1771) – ప్రసిద్ధికెక్కిన రచనలు.

1760 ప్రాంతంలో ఒక గ్రామాన్ని, పొలాల్ని కూల్చి ఓ ధనవంతుడి తోటగా మార్చడాన్ని చూసిన Oliver Gold Smith ఈ కవితను వ్రాసినాడు. 1770లో ఈ కవిత ప్రచురింపబడినది.

ఆలివర్ గోల్డ్‌స్మిత్ వ్రాసిన The Deserted Village (1770) క్రాబె (Crabbe) కవిత The Village (1783) పల్లెటూరి వాతావరణాన్ని, వాటిని పాడు చేస్తున్న నవీన సమాజపు పోకడలను తెలియజేస్తాయి. శామ్యూల్ జాన్‌సన్ కవిత The Vanity of Human Wishes (1749) నిరర్ధకమవుతున్న మానవీయ విలువల్ని ప్రబోధిస్తుంది.

The Deserted Village ను Middle weight poem కు మంచి ఉదాహరణగా పేర్కొంటారు. ఈ కవితతో ఆలివర్ గోల్డ్‌స్మిత్‌ను– 'A Powerful Yet Gentle Master' గా జాన్‌సన్ అభివర్ణించినాడు.

1. పాడుబడిన గ్రామం

(The Deserted Village)

ప్రియమైన ఆబర్న్! మైదానపు అందమైన గ్రామమా!
ఎక్కడైతే ఆరోగ్యం, సంపదలు శ్రామికులను ఆనందపరుస్తాయో
ఎక్కడ నవ్వే వసంతం తన మొదటి మజిలీ చేస్తుందో,
ఇంకా మిగిలివున్న పూలగుత్తులు వేసవిని నిలువరిస్తాయో
అమాయకత్వం, సుఖజీవనమున్న అందమైన నివాసస్థలాలున్న
నా యవ్వనపు పీఠమది, అన్ని రకాల ఆటలకు నెలవై ఉన్నది
ఎంత తరచుగా నేను ఆ పచ్చిక బయళ్లపై తిరిగాను.
ప్రతి దృశ్యంలోనూ చక్కని ఆనందం మనసును హత్తుకునేదో,
ప్రతి ఆకర్షణ వద్దా ఎలా ఆగి చూసేవాడినో,
మంచాన్ని కప్పిన మంచె, వ్యవసాయక్షేత్రం,
ఎల్లప్పుడూ పారే వాగు, తీరిక లేని పిండి మర,
పొరుగునున్న కొండపైన హుందాగా ఉండే చర్చి,
హాథరన్ పొదలు, చెట్ల నీడలో కూర్చునేందుకు పీటలు,
ముచ్చట్లకు, ప్రేమికుల గుసగుసలకు వీలుగా!
ఎంత తరచుగా నేను రాబోయే రోజును ఆశీర్వదించేవాడినో!
ఉపవాసపు శ్రమ కాలం తరువాత ఆడుకునేప్పుడు
గ్రామసులంతా, సెలవుదినాల సందడిలో
విస్తరిస్తున్న చెట్టు కింద ఆటపాటల్లో మునిగితేలడం,
ఎవరి అభిరుచులకు తగ్గట్టుగా వాళ్లు ఆ చెట్టు నీడలో,
ఫోటోలలో యువకులు, పర్యవేక్షిస్తూ వృద్ధులు
రకరకాల తమాషాలు, సయ్యాటలు, కుప్పిగంతులు
కనికట్టు, ఇంద్రజాలాలు, బలప్రదర్శనలు
ఒకరకం ఆట ఆయిపోగానే మరల కొత్త ఆట
దాని తరువాత మరో రకపు కొత్తఆట

నాట్యం చేసే జంటలు పేరుకోసం పాకులాట
ఒకరి కౌగిలిలో ఒకరు అలిసిపోయేదాకా
పల్లెటూరి పిల్లగాడు తన పొగచూరిన ముఖాన్ని దాస్తుంటే
రహస్యపు చిరునవ్వులు అక్కడక్కడా గలగలమంటుంటే
ధైర్యంగల కన్య ప్రేమతో కూడిన క్రీగంటి చూపులు
వాటిని ఒప్పుకోనంటున్న సంరక్షకురాలి తీవ్ర వీక్షణాలు
అటువంటి అందాలు, ఆకర్షణలుండేవి నా ప్రియ గ్రామంలో,
శ్రమైకజీవన ఆనందాన్ని అందరికీ నేర్పేవి
ప్రతి గృహం చుట్టూరా చిరునవ్వుల ప్రభావముండేది
ఆ ఆకర్షణలు, ప్రియ గ్రామమా, నీవి, అవన్నీ ఎగిరిపోయాయి!

తియ్యని చిరునవ్వుల గ్రామమా, మైదానపు అందమైన గ్రామమా!
నీ ఆటపాటలన్నీ ఎగిరిపోయాయి, నీ ఆకర్షణలు తగ్గిపోయాయి.
నీ గృహాల మధ్య కనిపిస్తున్నది క్రూరుని హస్తం.
నిర్మానుష్యత వెక్కిరిస్తున్నది నీ ఆకుపచ్చదనాన్ని.
ఒకే ఒక ప్రభువు ఆక్రమణలో సువిశాల రాజ్యం.
నీ నవ్వుల మైదానంపై సగం దున్నిన చాళ్లు
అద్దంలాంటి ఏరు పగటిని ప్రతిఫలించడం లేదు
గడ్డీ, నాచుతో నిండిపోతున్నది దుబ్బల మధ్య.
నీ కొండల డొంకల్లో, ఓ ఒంటరి అతిధి
రాయి తొలిచే పక్షి–బిట్టర్న్ – తన గూటిని కాపాడుతూ అరుపు!
నీ ఎడారి నడవల్లో ఎగుర్తోంది లాప్‌వింగ్ పక్షి
మార్పులేని అరుపుల్తో ప్రయత్నిస్తున్నది ప్రతిధ్వనులకై
నీ గృహాలన్నీ శిధిలాలై నేలకూలిన జాడలు
నాచు పట్టిన గోడలపై ఆకుపచ్చని గడ్డి ఆనవాళ్లు
వణుకుతూ క్రుంగుతూ, దోపిడీ ప్రభువుకు దొరకకుండా
దూరదూర ప్రాంతాలకు తరలిపోయినారు నీ పిల్లలు.

చెడు దాపురించింది నేలకు, వ్యాధులు బలికోరినాయి
ధనం పోగైన చోట్ల, మనుషులు పతనమౌతుంటారు
యువరాజులు, ప్రభువులు వృద్ధి క్షయాలు చెందుతారు.
ఒక ఊపిరి సృజిస్తుంది వాళ్లను, ఊపిరి సృజింపబడినట్లే
ధైర్యం గల రైతాంగం, వాళ్ల దేశానికి గర్వకారణం,
ఒకసారి గనుక ధ్వంసం చేయబడితే, తిరిగి కోలుకోలేరు.

ఒకానొక కాలంలో, ఇంగ్లాండు దుఃఖాలు మొదలయ్యాయి.
ఎకరంలో నాలుగోభాగం ఒక మనిషిని పోషించేది.
అతడి సాధారణ శ్రమతో నేల సంపదలనిచ్చేది.
జీవనానికి సరిపడినంత, ఎక్కువా కాదు, తక్కువా కాదు
మానవుడి గొప్ప స్నేహితులు– అమాయకత్వం, ఆరోగ్యం
అతడి ముఖ్య సంపద– సంపదల గురించి తెలియకపోవడం.

ఇప్పుడు మారింది కాలం;వ్యాపారపు స్పందనా రహిత పరివారం
భూమిని ఆక్రమించుకున్నది, పల్లెటూరి రైతుల్ని పడగొట్టినది
మైదానంలో అక్కడక్కడా వెలిసాయి కుగ్రామాలు
అదుపులేని సంపదలు, బ్రహ్మాండమైన ఆడంబరాలు
ప్రతి కోరికా ఐశ్వర్యానికి సంబంధించినదే
ప్రతి కేకా అతిశయం కోసం వేసే తప్పటడుగే,
సంపదలు సృష్టించిన సున్నితపు ఘడియలలో
ప్రశాంతపు కోర్కెలకు కాసింత చోటు కూడా దొరకదు.
ప్రశాంత దృశ్యంలో కనిపించిన ఆరోగ్యకరమైన ఆటపాటలు
ప్రతి ఒక్కరి కనులలో, పచ్చదనపు ప్రకాశంలో వెలిగినవవి
ఎప్పుడో వెళ్లిపోయాయి, ఏదో తీరాన్ని అన్వేషిస్తూ–
గ్రామీణపు ఆనందాలు, అలవాట్లిప్పుడు కానరావు.

ప్రియమైన ఆబర్న్ గ్రామమా! మధుర ఘడియల జన్మస్థానమా!
నీ నిరాధారమైన డొంకలు క్రూరపాలకుడి శక్తిని చాటుతున్నాయి.

నేనిక్కడ ఒంటరిగా నడుస్తున్నాను.
నీ చిక్కులు పడిన దారులలో, శిథిల మైదానాల్లో
ఎన్నో ఏళ్లు గడిచాయి, తిరిగి వచ్చాను చూడడానికి
ఎక్కడైతే ఓ కుటీరం ఉండేదో, హాథరన్ పొదల్తో
జ్ఞాపకాలు ఓ బండ్ల వరుసలా వస్తున్నాయి
నా ఎదలో ఉప్పొంగి, గతాన్ని బాధగా మారుస్తున్నాయి.

ఈ రక్షిత ప్రపంచమంతా నేను సంచరించాను.
నా దుఃఖాలలో– 'దేవుడు నా వంతు నాకిచ్చినాడు'
నాకింకా ఆశ ఉన్నది– నా చివరి ఘడియలలోనైనా కిరీటం దక్కుతుందని
ఈ మామూలు గృహాల మధ్య విశ్రమించాలని
జీవిత చరమాంకాన్ని జాగ్రత్తగా గడపాలని
ఊరికే విశ్రాంతి తీసుకుని జీవన జ్వాలను వృథా చేయకూడదని
నాకింకా ఆశ ఉన్నది, మరల మన గర్వం మనకు దక్కుతుందని.
పల్లెటూరి ప్రజల మధ్య నా పుస్తక జ్ఞానాన్ని ప్రదర్శించాలని
నా నెగడు దగ్గర సాయంకాలపు గుంపుతో సంభాషించాలని
నేను అనుకుంటున్నది, నేను చూసింది చెప్పాలని–
వేటకుక్కలు, కొమ్ముల జంతువులు తరుముతున్న కుందేలులా
తాను మొదట పెరిగిన ప్రదేశానికి వగరుస్తూ ఎగిరిపోవాలని
నాకింకా ఆశలున్నాయి, నా దీర్ఘ ఆయాసాలు తొలిగినవి.
నేను తిరిగి వచ్చాను, నా ఇంటి వద్దనే చనిపోవడానికి.

ఓ ఆశీర్వదింపబడిన విశ్రాంత జీవనమా,
జీవన పతన దశలో స్నేహరూపమా,
సంరక్షణ నుంచి వెనక్కి మరలడం కాదు నా లక్షణం
ఇటువంటి చల్లని నీడలలో విశ్రమించడమెంత ఆనందం
సుఖవంతమైన కాలంలో శ్రమైక జీవన సౌందర్యం.
బలవత్తరమైన ఆకర్షణల ప్రపంచాన్ని వదలడం

యుద్ధం సాధ్యపడనప్పుడు, ఎగిరిపోవడం నేర్చుకోవడం
అతడికి ఏ దౌర్భాగ్యాలూ ఉండవు;
పుట్టిందే పనిచేయడానికి, శోకించడానికి.
గనుల్ని శోధించడం, అపాయపు లోయల్లోకి దిగడం
అపరాధిగా ఏ దుష్టుడైన కూలీ ఉండదలుచుకోడు.
గుమ్మం ముందుకు వచ్చిన కరువును తిప్పికొట్టకుండా,
తరువాత తన అంత్యకాలంలో దానిని కలుస్తాడు
అనుకోని పతనంతో సమాధి గొయ్యివేపు ఒరుగుతాడు
విశ్రాంతి జీవనం దానికి దారిచూపుతుంది.
అతడి ఆశలన్నీ కడకు కాంతివంతమౌతాయి.
ఈ ప్రపంచంతో పని ముగిసాక, మొదలువుతుంది స్వర్గ ప్రయాణం.

మధురమైనదా ధ్వని, సాయంకాలపు సమాప్తిలోనిది
దూరపు కొండలపై గ్రామపు గుసగుస పెరుగుతుంది
అజాగ్రత్తగా, నెమ్మదిగా నేనటుగా నడిచేప్పుడు
దిగువ నుంచి వస్తున్న స్వరాలు క్రమేపీ శ్రావ్యమవుతాయి.
గోపికాస్త్రీ గానానికి పల్లెటూరి రైతు స్పందిస్తాడు
హుషారైన పశువుల మంద తమ లేగదూడలను చేరుకునేవి!
చెరువు దగ్గర బాతులు లొడలొడ ధ్వనులు చేస్తుండేవి.
పాఠశాల నుంచి పిల్లలు వదిలిపెట్టబడి ఆటలాడేవారు,
గుసగుసగా వీస్తున్న గాలిని చూసి కాపలాకుక్క మొరిగేది.
బిగ్గరగా వినిపిస్తున్న నవ్వులు ఖాళీ మనసులను తలపించేవి.
ఇవన్నీ మధురమైన గందరగోళంలో చెట్టు నీడకు చేరుకునేవి.
నైటింగేల్ పాట విరామపు సమయంలో వినబడేది.
ఇప్పుడు జనపు రణగొణధ్వనులు మాయమైనాయి.
గాలిలో పరివ్యాప్తమయ్యే ఆనందపు గుసగుసలు లేవు
గడ్డి మొలిచిన కాలిబాటలపై అడుగుల చప్పుడు లేదు

జీవితపు పుష్పవికాసమంతా అదృశ్యమైనది.
ఒంటరి ప్రదేశమా, నీదిప్పుడు వైధవ్య జీవితం.
చెమ్మగా ఉండే ఏటివేపు బలహీనంగా వంగుతున్నది.
ఆమె, క్రూరురాలైన వృద్ధ సంరక్షకురాలు, రొట్టెకోసం బలవంతపెడ్తుంది.
ఏటిని కప్పిన విప్పారిన శిరోజాలను విడదీస్తున్నది.
ముళ్లపొదలపై నుంచి శీతాకాలపు కట్టలను తీస్తున్నది.
తన రాత్రి గృహాన్ని కనుగొని, తెల్లవారే వరకు విలపిస్తుంది.
అపాయ రహిత పరివారంలో ఆమె ఒక్కటే మిగిలింది.
విచారగ్రస్త మైదానంలో దుఃఖించే చరిత్రకారుడిగా ఆ గ్రామం.
ఒకప్పుడు పూలతోట నవ్వినచోట, ఇప్పుడది శవప్రాయమైనది.
అయినా అక్కడక్కడ అడవిలా పెరుగుతున్న పూలమొక్కలు
అక్కడ, ముళ్లపొదలు పెల్లగించిన ఆనవాళ్లున్న చోట
గ్రామ మతబోధకుడి సాధారణ భవనముండేది
పల్లెటూరి ప్రజలకందరికి ఇష్టమైనవాడతడు.
నలభై పౌండ్ల ఏడాది సంపాదనతో డాబుగా బతికేవాడు.
పట్టణాలకు దూరంగా తన దివ్య పరుగుపందెం
తన పద్ధతి మారలేదు, తానున్న పద్ధతీ మార్చదల్చుకోలేదు.
నక్కవినయాలు లేవు, పదవికై ఆరాటాలు లేవు,
మారే కాలానికి అనుగుణంగా సిద్ధాంతాల మార్పులు లేవు.
ఏవో సుదూర లక్ష్యాలకై అతడి హృదయం కొట్టుకునేది.
తన బాగు కన్నా క్రూరులను బాగు చేసేందుకు పనిచేసేవాడు.
అతడి ఇంటినిండా ఉండేవాళ్లు అల్లరిచిల్లర జనం
వాళ్ల తిరుగుళ్లను తిట్టినా, వాళ్ల బాధలను పోగొట్టేవాడు.
చాలాకాలం గుర్తున్న బిచ్చగాడు అతడి అతిథి.
అతడి గడ్డం జాలువారి రొమ్మును కప్పుతుండేది.
జల్సారాయుడు దివాళీతీసాడు, గర్వం లేదిప్పుడతడికి.
బంధుత్వాన్ని కలుపుకున్నాడు, అనుమతి పొందినాడు

అంగవికలుడైన సైనికుడు ఆశ్రయం సంపాదించినాడు
నెగడు దగ్గర కూర్చుని రాత్రంతా కథాకాలక్షేపం చేసేవాడు.
తన గాయాల గురించి కన్నీరు పెడ్తూ దుఃఖగాథలు వినిపించేవాడు.
కట్టెను పట్టుకుని తన వీరత్వాన్ని ప్రదర్శించేవాడు
తన అతిథులిచ్చిన ఆనందంతో, మంచి మనిషి పొంగేవాడు
కష్టాలను వింటూ వాళ్ల చెడు అలవాట్లను మరిచేవాడు
వాళ్ల లోపాలను గుణాలను పట్టించుకోలేదెన్నడూ,
అతడు కరుణతో వారికి సహాయం చేసేవాడు.

చెడ్డవాళ్లను బాగుచేయడమే అతడికి గర్వం.
తప్పులు జరిగినా చివరకు శీలమే గెలిచేది.
ప్రతి పిలుపుకూ పలికేవాడతడు,
చూసేవాడు, దుఃఖించేవాడు, ప్రార్థించేవాడు అందరి కొరకు
పక్షి తన ప్రియమైన పసికూనకు
నింగిలో ఎలా ఎగరాలో నేర్పినట్లు, నేర్పేవాడు.
ప్రతి పనీ చేసేవాడు, ఆలస్యాన్ని తిట్టేవాడు
కాంతిలోకాలచే ఆకర్షింపబడి, ఆ దారిన ముందు నడిచేవాడు.

విడిపోతున్న జీవనపు శయ్య పక్కన నిలబడి
దుఃఖం, దోషం, బాధ అంచెలంచెలుగా ఆశ్చర్యపరుస్తున్నపుడు
పవిత్రుడైన విజేత నిలబడేవాడు స్థిరంగా.
అతడి పర్యవేక్షణలో నిరాశ, వేదన, కలవరపడ్తున్న
ఆత్మనుంచి తప్పుకునేవి.
కంపిస్తున్న అనాథ దేహంలో ప్రశాంతత కానవచ్చేది.
అతడి ఆఖరి తడబడే మాటలలో పొగడ్త ధ్వనించేది.

చర్చిలో, దైవభక్తితో కూడిన నమ్రతతో, చలించని కరుణతో
అతడి దృక్కులు ఆ పవిత్ర ప్రదేశాన్ని కాంతివంతం చేసేవి

అతడి పెదాల నుంచి వెలువడిన సత్యవాక్కులు రెండింతలు బలంగా ధ్వనించేవి.
ఎగతాళి చేద్దామనుకుని వచ్చిన మూర్ఖులు ప్రార్థనలు చేసేవాళ్లు
ఆ దైవభక్తుడి చుట్టూరా ప్రభు సేవలు నడిచేవి.
మొక్కవోని విశ్వాసంతో అతడు విధులు నిర్వహించేవాడు.
పిల్లలు కూడా అతడి ఉపాయాలను ప్రేమతో అనుసరించేవారు.
అతడి అంగీని లాగుతూ చిరునవ్వులను పంచుకునేవారు
అతడి చిరునవ్వులో తండ్రిప్రేమ ప్రత్యక్షమయ్యేది.
వారి సుఖ సంతోషాలు అతడికి సంతృప్తినిచ్చేవి
వారి కష్టాలకు, చింతలకు అతడు దుఃఖించేవాడు.
వారికి తన హృదయాన్ని, ప్రేమను, విచారాల్ని ఇచ్చినాడు.
అయితే, అతడి ముఖ్య ఆలోచనలన్నీ స్వర్గం వేపే.
ఒక ఉన్నత శిఖరం, తన అద్భుత రూపాన్ని పైకిలేపి
లోయల్నుండి ఉబికి, మధ్యలో తుఫానుగా మారగా
రొమ్ముల ఎత్తులో కదుల్తున్న మేఘమాలికలు
దాని శిరస్సున శాశ్వత సూర్యకాంతి.

ఆ దారిని కప్పిన చెదిరిన కంచె పక్కన
ముళ్లచెట్లు విరగబూసినాయి ఆనందంగా
అక్కడ తన సందడిగా ఉండే భవనంలో, పరిపాలనాదక్షుడు
బడి పంతులు తన పాఠశాలను నడిపేవాడు
తీవ్రంగా, హుందాగా కనిపించేవాడు, స్థిరమైన దృక్పథంతో
నాకతడు తెలియును, ప్రతి అల్లరిపిల్లవాడికీనూ
అతడి ముఖంలోని వణుకును చూసి
సోమరి పిల్లలు పసికట్టేవారు
ఆరోజు రాబోయే అపాయాలను,
నకిలీ చిరునవ్వులతో పకపకా నవ్వేవారు
అతడి ప్రతి హాస్య సంభాషణకూ!
అతడు గంభీరంగా ఉంటే ఆ వార్త ముందే తెలిసి

ఆ ప్రదేశమంతా గుసగుసలు మినహా నిశ్శబ్దమే!
అతడు దయగలవాడు, తప్పు చేస్తే క్షమించడు
చదువు చెప్పడంపై అతడికున్న ప్రేమ కొలవలేనిది.
అతడికెంత తెలుసో గ్రామానికంతా తెలుసు.

–'అతడు వ్రాయగలడు, అర్థం చెప్పగలడు,
పొలాలు, భూములు కొలుస్తాడు, కష్టనష్టాలు జోస్యంచెబ్తాడు
అతడు చూసి చెప్పగలడు దీని పరిమాణమింతని,
వాగ్ధాటిలో కూడ అతడికి నైపుణ్యం ఉంది.
ఓడిపోయినా తనదే పైచేయిగా, వాదిస్తాడు
పెద్దపెద్ద మాటలు, ధ్వనించే శబ్ద సహిత వాక్యాలు
వాటికి ఆశ్చర్యపడి మొరటు జనం మూగేవాళ్లు
చూసినకొద్దీ ఆశ్చర్యపడి, ఆశ్చర్యపడినకొద్దీ చూసేవాళ్లు
ఇంత చిన్న బుర్రలో ఎక్కడిదింత పెద్ద జ్ఞానమని?'–

అతడి ఘనకీర్తిప్పుడు గతమైనది. అతడు
తన వాగ్యుద్ధాలను గెలిచిన చోటులు వచ్చాయి మరపుకు
బహుశా ఈ ముళ్లచెట్టు తలెత్తిన చోట!
చూసేవాళ్లకిక్కడ ఓ సూచికాస్తంభం కనిపించేది.
దిగువనున్న ఇంటి దగ్గర్లోనే, గోధుమరంగు బీరు లాగించేది
నెరసిన మీసం, గడ్డాల వాళ్లు ఆనందాలు, శ్రమలు పంచుకునేది
అక్కడే ఊరి రాజకీయనాయకుడు నిగూఢంగా మాట్లాడేవాడు.
వాళ్లు తాగే ఏల్ సారాయికన్నా పాత వార్తలు ప్రవహించేవి ఎక్కువగా
ఊహాగానాలకు అంతుండేది కాదు
ఆ వేడుకా గృహంలో అనేక ఆనందాలు
తెల్లగా సున్నం వేసిన గోడలు, ఊడ్చిన ఇసుకనేల
తలుపు వెనక టిక్కుటిక్కుమనే గోడగడియారం
వార్నిష్ చేయబడి తళతళమెరుస్తూ

పెద్ద పెట్టె ఎంత అప్పు రెండింతలైనా తీర్చేసేంతటిది
రాత్రిపూట ఓ పడక, పగలు అరలున్న బల్ల
అలంకరణకు కాసిని చిత్రాలు, అవే ఆటలకు
పన్నెండు నియమాలు, రాచరికపు బంతులాట
పగటిపూట కూడ చలి వణికిస్తే తప్ప
ఓ నెగడు, ఆస్పెన్ కొమ్మలు, పూలు, మెంతికూర
పగలిన టీకప్పులు, అలంకరణలో భాగంలా
చిమ్నీపైన వరుసగా పేర్చబడి ఉండేయి అందంగా.

వృథా! తాత్కాలిక అందాలు! ఇవేమీ
కూలిపోతున్న భవనానికి కొత్త ఊపిరినివ్వలేవు.
అంధకారంలో కలిసిపోతుంది, పేదవాడి హృదయంలో
ఒక్కగంట కూడా స్థానానికి నోచుకోనిది;
ఇక్కడ కిప్పుడు ఏ నిరుపేద రైతూ రాడు,
తన దిన చింతనలనుంచీ తియ్యని విస్మృతిలోకి పోడు
రైతుల వార్తలు, క్షురకుని కథలు ఇకలేవు
చెట్లు నరికేవాడి పాటలు వినరావు
పొగచూరిన కనుబొమల్ని తుడుచుకుంటూ లోహకారుడు కానరాడు
బలంగా మోదుతూన్న పనిని ఆపి కాస్త మన మాట వినడు
ఆతిథ్యమిచ్చేవాడు అసలు కానరాడు
ఆనందం నలువేపులా ప్రవహించడం చూడబోడు
బిడియంతో కన్య క్రీగంట చూస్తూ
కప్పును పెదాలపై నొక్కుకుని పూర్తిగా తాగడమిక కానరాదు.

అవును, భాగ్యవంతులు గేలిచేయనీ, గర్విష్ఠులు తిరస్కరించనీ
ఈ మామూలు మనుషుల ఆశీస్సులు
నాకెంతో ప్రియమైనవి, నా హృదయానికి సమ్మతమైనవి
ఒక సహజమైన స్థానిక ఆకర్షణ, గొప్ప చిత్రాలకన్నా విలువైనది.

స్వేచ్ఛ నిండిన ఆనందాలు, ప్రకృతి స్వయంగా పాల్గొనే క్రీడలు
వాటిని ఆత్మ అనుసరిస్తుంది, తొలి ఆనందాన్ని ఏలుతుంది.
అవి ఖాళీ మనస్సులతో ఆటలాడుతాయి తమాషాగా,
అసూయ లేనివి, అవమానపరచబడనివి, నిర్బంధింపబడనివి.
కాని, దీర్ఘాడంబరాలు, అర్ధరాత్రి మారువేషపు క్రీడలు
అధిక సంపదలున్న పోకిరీల కృత్రిమ వైభోగాలు
వీటితో పనికి మాలిన వాళ్ల కోరికలు నెరవేర్తాయి
శ్రమతో కూడిన ఆనందం నెప్పులకు దారితీస్తుంది.
నాగరికతలో వెలిగే కళాకృతులన్నీ మోసపూరితాలే,
వాటిని నమ్మలేక హృదయం అడుగుతుంది, 'ఇదా ఆనందం'!

మిత్రులారా, రాజకీయవేత్తలారా, సర్వేక్షణ చేయండి,
ధనికుడి ఆనందాలు పెరుగుతున్నాయి, పేదవాడివి నశిస్తున్నాయి.
న్యాయం మీరే చెప్పండి – అగాధమెంత పెరుగుతున్నదో
సౌభాగ్యానికి ఆనందానికి మధ్య దూరం
గర్వపు అల ఉబుకుతుంది మోసుకువచ్చిన ముడి ఖనిజంతో
దోషం అరుస్తుంది తన తీరం నుంచి పొగడ్తల కేకలతో
పిసినారి కోరిక కన్నా ఎక్కువగా సంపదలు సిద్ధిస్తాయి
ధనికులు ప్రపంచమంతా తిరుగుతారు సమూహాలుగా
అయినా, లాభాలను గణించండి. సంపద అనేది ఒక పేరు
మనకు పనికి వచ్చే వస్తువులు మాత్రం అవే కదా!
నష్టాలలా కాదు, సంపదలు, గర్వమున్న వ్యక్తి
ఎందరో పేదల స్థలాన్ని ఆక్రమిస్తాడు
తన సరస్సు, ఉద్యానవనాల సరిహద్దులు పెంచుతాడు
తన గుర్రాలకు, వాహనాలకు, కుక్కలకు స్థలాలు
అతడు తొడుక్కునే పట్టు అంగీకి
పక్కనున్న పొలాల్లో పంట సగం ఖర్చు వ్రాస్తాడు
ఒంటరి పీఠంపై కూర్చుని ఒక్కడే తిలకిస్తాడు క్రీడల్ని

ఆగ్రహం తిరస్కరిస్తుంది హరిత మైదానపు కుటీరాలను
ప్రపంచం నలు మూలల్నుంచి కావాల్సిన వస్తువు ఎగిరివస్తుంది
ఆడంబరపు చిహ్నాల్ని లోకం సమకూరుస్తుంది
దేశమంతటా కృత్రిమ ఆనందపు వనరులేర్పడినాక
బందీ కాబడిన ఐశ్వర్యం పతనం కోసం నిరీక్షిస్తుంది,

ఎవరైనా అందగత్తె అలంకరించుకోకుండా ఉండి
తన యవ్వన సామ్రాజ్యాన్ని ఏలుతున్నపుడు
ఆమె తిరస్కరిస్తుంది కృత్రిమ డాబులను, కొనుక్కున్న ఆకర్షణలను
తన కనులలోని విజయాన్ని కళలతో పంచుకోనంటుంది
ఎప్పుడైతే ఆ అందం కాస్త వెనకబడ్తుందో
అందపు ఆకర్షణలు తాత్కాలికాలే కదా
కాలం ముందుకు పోతుంది, ప్రేమలు విఫలమవుతాయి
కాంతివంతంగా మెరుస్తూ, ఆశీస్సులు పొందడానికి ఆసక్తి చూపుతుంది,
ఆహార్యంలోని మెరిసే బలహీనతకు,
అలా ఈ నేలపై ఐశ్వర్యాతిశయం మోసగించబడ్తుంది.
ప్రకృతి సహజమైన అందాలను లోకువ చేసి చూస్తారు
పతనపు అంచు దగ్గర ఒక్కోసారి పైకి లేస్తారు
నూతన దారులు ఆవిష్కరించబడతాయి, భవనాలు ఆశ్చర్యపరుస్తాయి.
చిరునవ్వుల మైదానాలపై కరువు విరుచుకుపడినప్పుడు
విషాదపు మార్గంలో పేదరైతు తన చిన్ని కుటుంబంతో కన్నీళ్లపాలౌతాడు
అతడు మునిగిపోతుంటే రక్షించే హస్త మొక్కటీ ఉండదు
దేశంలో వెల్లివిరుస్తాయి– ఒక తోట, ఒక స్మశానం

అప్పుడు ఎక్కడ, హే, పేదరికం ఎక్కడుంటుంది?
తాకుతున్న పొరుగు గర్వాన్నుంచి ఎలా తప్పించుకోగలదు?
సరిహద్దులు లేని స్థలాలను సమీపించినపుడు
అతడు తన మందల్ని అక్కడక్కడా ఉన్న పచ్చికవేపు పంపుతాడు

ఆ కంచెలు లేని పొలాల్ని కూడా ధనవంతుల బిడ్డలు పంచుకుంటారు
సాధారణ జనానికి ఉమ్మడి బీళ్లు కూడా కరువవుతాయి.

అలా అని పట్టణాలకు పరిగెడ్తే- అక్కడేం దొరుకుతుంది?
అతడు పంచుకోలేని పుష్కల సంపదలు,
పదివేల రకాల వినాశ హేతువులైన కళలు,
అన్నీ కలిసి అతిశయాన్ని పెంచుతాయి, మానవత్వాన్ని తుంచుతాయి.
ఆనందపు పుత్రులు ఈ సంతోషాల్ని తెలుసుకుంటారు.
అవి ఇతరుల శ్రమ, కష్టాల నుంచి గుంజబడినవని,
ఈలోగా సభికుడు తన జరీ అంగీలో మెరుస్తుంటాడు.
దెబ్బతిన్న వృత్తులతో కళాకారుడు పాలిపోతాడు,
ధనమదాంధులు దీర్ఘ వాహనాలపై డాబుసరిగా ఊరేగుతుంటే,
వారి పక్కనే నల్లటి శవ వాహనాలు విషాదంగా పోతుంటాయి.
అర్ధరాత్రి ఆనందాలను కళ్లారా చూసిన గోపురాలు,
లోపలికి రానిస్తాయి ఆడంబరంగా, ఐశ్వర్యవంతులను,
ప్రకాశవంతమైన కూడళ్లలో గుమికూడాయి కలకలపు ఘనతలు
రథాల చప్పుళ్లు కలహిస్తాయి, కాగడాలు ప్రజ్వలిస్తాయి.
ఇటువంటి దృశ్యాలు సమస్యలను తీసుకువస్తాయా!
ఇవి సార్వత్రిక ఆనందాన్ని చూపించడం లేదా!
ఇవి నీ ఆలోచనలా? అయితే ఓ క్షణం ఇటు చూడు!
నిలువ నీడలేని పేదరాలు చలిలో ఎలా వణుకుతున్నదో,
ఒకప్పుడామె పల్లెటూళ్లో వైభవంగా బతికినదే,
అణగదొక్కబడిన అమాయకత్వపు కథల్ని విని దుఃఖించినదే,
ఆమె వినయంతో కూడిన చూపులు కుటీరానికి కళ తెచ్చేవి.
అడవి గులాబీలా తీయగా ముల్లు వెనక నుంచి తొంగిచూసేది.
అన్నిటినీ కోల్పోయింది, తన స్నేహితుల్ని, గుణశీలాల్ని
తనను మోసం చేసిన వాడి గుమ్మం వద్ద తల వాల్చుతున్నది.
చలికి వణుకుతూ, వానజల్లుకు తడిసి కుంగుతున్నది.

బరువెక్కిన హృదయంతో ఆ దురదృష్టపు ఘడియల్ని నిందిస్తున్నది.
మొదట సోమరితనం వలన, పట్టణం మీద గాఢ వాంఛతో
తన చరఖా చక్రాన్ని, పల్లెటూరి ముతక వస్త్రాల్ని విడిచి వచ్చిందామె.

ప్రియమైన ఆబర్న్ గ్రామమా, నీదే, నీదే, ఈ అందమైన పరివారం,
నీ అందమైన తెగలు ఆమె బాధలలో పాలుపంచుకున్నాయా?
ఇప్పటికీ, బహుశా, చలీ, ఆకలికి లోనైనా
గర్విష్ఠి మనుషుల ద్వారాల వద్ద రొట్టెముక్కకై యాచిస్తున్నాయా?

ఆహ్! లేదు! దూర సీమలలో... ఇంకోరకమైన భీకర దృశ్యం.
సగం ఉబ్బెత్తు ప్రపంచం అడ్డువస్తుంది మధ్యలో
అత్యుష్ణపు దారుల్లో, తూలిపడే అడుగుల్తో నడుస్తారు వాళ్లు
అక్కడ అల్తామా ఎడారి వారి కష్టాలను గుసగుసలాడ్తుంది.
ఇంతకు ముందు ఆకర్షించినవే ఇప్పుడు వ్యతిరేకంగా కనిపిస్తాయి
రకరకాల భీభత్స దృశ్యాలు భయంకరంగా ఎదురొస్తాయి
మండే సూర్యుడు మహోగ్ర కిరణాలను దిగువకు కురిపిస్తాడు
భరించలేని పగలు మలమల మాడ్చేస్తుంది.
కాంతిహీనమైన అడవుల్లో పక్షులు పాడడం మరచిపోతాయి.
జోగుతున్న గబ్బిలాలు నిశ్శబ్ద సమూహాలుగా వేలాడుతుంటాయి.
విషపూరితమైన పొలాలు ఆడంబరంగా మెరుస్తుంటాయి.
నల్లటి తేళ్లు మృత్యువును మోసుకుని తిరుగుతుంటాయి.
ప్రతి అడుగులోనూ కొత్త భయం తలెత్తుతుంటుంది.
పగబట్టిన పాము ప్రతీకారపు చప్పుడు చేస్తుంది.
అసహాయపు ఎరకోసం పులులు కాచుకుని ఉంటాయి.
వాటికన్నా క్రూరులైన ఆదివాసులుంటారక్కడ
పిచ్చెక్కినట్లు సుడిగాలులు అకస్మాత్తుగా విజృంభిస్తాయి.
భూమిని ఆకాశాన్ని కలుపుతూ విధ్వంసం సృష్టిస్తాయి.
ఇంతకు ముందు దృశ్యం కన్నా వచ్చేది మరింత ప్రత్యేకంగా ఉంటుంది.

చల్లటి సెలయేరు, పచ్చిక నిండిన ఆకుపచ్చ మైదానం
చటుక్కున కానవస్తాయి, పక్షుల ధ్వనుల్తో వనాలు,
అపాయం లేని ప్రేమకు ఆశ్రయమిచ్చిన ప్రదేశాలు.

అయ్యో స్వర్గమా! ఎటువంటి విషాదకరమైనదా చెడు దినం!
తమ ఊళ్లను విడిచి వలసపోయిన దుర్దినం.
పేదలు బాగుపడితేనే కదా, ప్రతి ఆనందమూ ఘనతనొందేది.
తమ ఇళ్ల చుట్టూ తిరిగి, వాటిని కడసారిగా చూసి,
దీర్ఘ వీడ్కోలు పలికి, బరువెక్కిన హృదయాలతో
ఇటువంటివే పశ్చిమాన దొరుకుతాయని ఆశించి
దూరపు లోతుల్ని ఎదుర్కొనేందుకు భయంతో వణుకుతూ
తిరిగివచ్చి దుఃఖించి, మరల వెనక్కివచ్చి వెక్కివెక్కి ఏడుస్తూ
తొలిగా గ్రామాన్ని విడిచిన మంచిమనిషి
కొత్త ప్రపంచానికి పోతూ, సాటివారి కష్టాలకు కన్నీరు పెడ్తూ
తన కొరకు, సాహసమే ఊపిరిగా, చైతన్యశీలంతో
స్మశానానికి ఆవల ఉన్న ప్రపంచాలకు చేరుకోవాలని కోరిక.
అతడి అందమైన కుమార్తె, కన్నీళలో మరింత అందంగా ఉన్నది.
అసహాయపు కాలంలో తోడునీడగా నిలిచినది.
అతడి వెనుకనే నడుస్తూ మౌనంగా, తన ఆకర్షణలను మరచి
తన ప్రేమికుడిని దుఃఖంలో వదిలి తండ్రితో వెళ్లిపోయినది.
పెద్దపెద్ద ఫిర్యాదులతో తల్లి తన కష్టాలను ఏకరువు పెడ్తున్నది
ఆనందాన్నిచ్చిన శయ్యను ఆశీర్వదించినది.
కన్నీళ్లతో ఆలోచనలేని పిల్లలను ముద్దాడుతూ
చేతుల్లోకి తీసుకుని రెండింతలుగా దుఃఖిస్తున్నది.
ఆమె ప్రియమైన భర్త మగవాడిగా గాంభీర్యంతో
నిశ్శబ్దంగా అనునయిస్తున్నాడు ఎంతో ప్రయత్నం మీద.
ఓ అతిశయించిన ఐశ్వర్యమా! స్వర్గపు ఆజ్ఞచే శపించబడినా
నీవు ఇటువంటి విషయాలనెన్నిటిని మార్పిడి చేసుకున్నావు?

నీ మంత్రజలాలు, మోసపు ఆనందాలు
చివరకు నాశనాన్నే కొనితెస్తాయా ఈ సంతోష వ్యాప్తిలో;
నీ వలన సామ్రాజ్యాలు గొప్పగా పెరిగి పతనమయ్యాయే.
వాటి వెల్లి విరిసిన శక్తుల డంబాలు వాటివి కావు.
ప్రతి ఆర్థిక క్లిష్టపరిస్థితిలో అవి మరింత పెరిగాయి.
ఇబ్బడిముబ్బడిగా పెరిగి అదుపు తప్పిన కష్టాలయ్యాయి.
ఊబకాయంలా ఉబ్బి, శక్తిహీనమై, ప్రతి అంగమూ దుర్బలమై
అడుగుకు, అట్టడుగుకు మునిగాయి, చుట్టూరా విధ్వంసాన్ని వెదజల్లుతూ.

ఇప్పుడు కూడా విధ్వంసం మొదలవుతున్నది.
సగంపైగా వినాశనం పూర్తయినది.
నేననుకుంటాను, ఇక్కడ నిలబడి ఆలోచిస్తూ
ఈ నేలపై నుంచి పల్లెటూరి విలువలు మాయమైనాయని.
లంగరు వేసిన ఓడ తెరచాప ఎత్తినది.
ప్రతి ఝంఝూమారుతంతోపాటు వృథాగా వేచి ఉన్నది.
దిగువన ఒక విషాదపు దళం కదులుతున్నది.
తీరం నుంచి వెళ్తూ, అంచును చీకటి చేసినది.
ప్రేమ తృప్తిపడింది, రక్షణ ఆతిథ్యమిస్తున్నది
దయతో కూడిన వైవాహిక సంబంధాలు మిగిలి ఉన్నాయి.
ధర్మనిష్ఠ, దైవభక్తి ఉన్నతంగా ఉంచబడినవి.
స్థిరమైన విధేయత, విశ్వాసపాత్రమైన ప్రేమ.
ప్రియమైన పేదరికం– నీవు అందమైన సేవికవు.
సున్నితమైన ఆనందంలో ముందుగా ఎగిరిపోతావు.
ఈ లజ్జాపూరిత పతనమయ్యే కాలంలో నీవు పనికిరావు.
హృదయాన్ని గెలుచుకోడానికి, నిజాయితీతో కూడిన కీర్తి గెలవడానికి
ఓ ప్రియమైన అందాల కన్యా; చిన్నచూపు చూడబడినావు, నిందలు పడినావు
గుంపులో నా అవమానానివి, ఒంటరిగా ఉన్నపుడు గర్వకారణానివి,
నా సంతోషానికి కర్తవు; నా దుఃఖానికి మూలానివి.

మొదట నిరుపేదగా నన్ను కనుగొని, నన్నలాగే ఉంచినావు.
ఉన్నతమైన కళలు వర్ధిల్లే చోటున నన్ను నడిపించినావు
ప్రతి సుగుణాన్ని నేర్పినావు, బాగా బతకమని ఆశీర్వదించినావు.
నీకు వీడ్కోలు! ఓహ్! ఎక్కడ నీ స్వరాన్ని విన్నా
టొర్నొ గుట్టలపైన, పంబమార్కా పక్కనా
ఎక్కడైనా రాత్రింబవళ్లు సమానంగా అత్యుష్ణం జ్వలిస్తుందో
లేదా శీతాకాలం ధృవాలను మంచుతో కప్పివేస్తుందో
అక్కడ కూడా నీ గొంతు కాలాన్ని అధిగమిస్తుంది.
తీవ్రమైన చలివాతావరణాన్ని సర్దుబాటు చేస్తుంది.
నీ ఒప్పించగల నేర్పుతో సత్యానికి సాయం చేస్తుంది.
తప్పులు చేస్తున్న మనిషిని లాభాల పిచ్చినుంచి వెనక్కి మళ్లిస్తుంది.
అతడికి సహజశక్తిలోని స్థితులను బోధిస్తుంది.
ఎంత నిరుపేదైనా అతడూ ఆశీర్వదింపబడినవాడేనని
వ్యాపారపు గొప్పగొప్ప సామ్రాజ్యాలూ త్వరత్వరగా శిథిలమవుతాయని
శ్రమపడ్తున్న ఎలుకలను సముద్రం ఊడ్చేసినట్లు
ఆత్మశక్తి కాలాన్ని ఎదిరిస్తుందని, బోధిస్తుంది,
కొండశిలలు పెను తరంగాల్ని, ఆకాశాన్ని ఎదిరించి నిలుస్తాయని.

– ఆలివర్ గోల్డ్‌స్మిత్
(Oliver Goldsmith 1728-1774)

✧✧✧✧✧



రాబర్ట్ బర్న్స

(Robert Burns 25-1-1759 to 21-7-1796)

రాబర్ట్ బర్న్సు Rabby Burns, Bard of Ayrshire లాంటి పేర్లతో పిలువబడిన స్కాటిష్ కవి, సాహిత్యకారుడు. స్కాట్లాండ్ జాతీయకవిగా ప్రపంచ ప్రసిద్ధికెక్కినాడు. భావవాద కవిత్వంలో అగ్రగణ్యుడిగా (Pioneer in Romantic Movement) పేరు గాంచినాడు. స్కాటిష్ సాహిత్యానికి మార్గదర్శకుడిగా, The Greatest Scot గా 2009లో ప్రజలచే ఎన్నిక చేయబడినాడు. పేదరికంలో నిజాయితీగా జీవితం గడిపిన కవి.

A Red Red Rose, The battle of Sherramuir, Tam o Shanter; Ae Fond Kiss ప్రసిద్ధ గీతాలు. Spontaneity (ఆశుకవిత్వం), Directness (సూటిగా చెప్పడం), Sincerety (నిబద్ధత) ఇతడి కవిత్వంలోని ప్రధానాంశాలు.

Proto-Romantic Poet గా (పూర్వ భావవాదకవి) వర్డ్స్‌వర్త్, కాలరిడ్జి, షెల్లీలకు ప్రేరణగా Burns ను గౌరవిస్తారు. Heaven-taught ploughman గా Edinburgh Literati రాబర్ట్ బర్న్సును అభివర్ణించింది. రష్యా ప్రజలు ఇతడిని People's Poet - ప్రజాకవిగా కీర్తించారు. బర్న్సు రచనలు రష్యన్ భాషలోకి అనువదించబడగా, అవి అణగదొక్కబడిన ప్రజలకు స్ఫూర్తినిచ్చాయి, అత్యంత ప్రజాదరణ పొందినాయి.

A Man's a Man for all that ను రష్యన్ కమ్యూనిష్టు పార్టీ ప్రొగ్రెసివ్ కవితగా అభిమానించింది. 1795లో వ్రాయబడిన ఈ పాట సర్వమానవ సమానత్వాన్ని (Egalitarian) స్వేచ్ఛావాదాన్ని (Liberalism) ప్రబోధిస్తుంది. ఫ్రెంచి విప్లవ కాలంలో వ్రాయబడిన ఈ కవిత– హోదా, డబ్బు, అనైతిక ప్రవర్తనలు, తప్పుడు మత సిద్ధాంతాలను తీవ్రంగా ఖండిస్తుంది.

✧✧✧✧✧

1. మనిషెప్పటికైనా మనిషే!

(A Man is a man for all that)

నిజాయితీ గల పేదరికానికి
తలవాల్చుకునే పనేమున్నది, అటువంటివన్నీ;
పిరికి బానిస అది – పక్కగా వెళ్తాం మనం
పేదలమై పోతామా, అంత మాత్రానికని!
అంతమాత్రానికని, అటువంటివన్నీ
మన శ్రమలు మాసిపోతాయా, అటువంటివన్నీ,
హోదా అనేది ఓ స్వర్ణనాణెపు ముద్ర అని,
మనిషి ప్రవర్తిస్తాడు మూర్ఖంగా, అంతమాత్రానికని!

హోమ్లీ ఫేర్‌లో భోంచేస్తే ఏమిటి?
నల్లటి ముతక ఉన్ని తొడుక్కుంటే ఏమిటి, అటువంటివన్నీ,
మూర్ఖులకు సిల్కు అంగీలు, సేవకుల కింత మధువు
మనిషెప్పటికీ మనిషే, అంతమాత్రానికని.
అంతమాత్రానికని, అటువంటివన్నీ,
వాళ్ల చెమ్కీ బంగారపు ప్రదర్శనలు, అటువంటివన్నీ;
నిజాయితీగల మనిషి ఎంత పేదవాడైనా
మనుషుల్లో రారాజు, అందుకోసమని.

అదుగో! అక్కడ చూడు, ప్రభువుగా పిలువబడ్తున్న యువకుడిని,
నత్తినత్తి మాటలు, వెర్రివెర్రి చూపులు, అటువంటివన్నీ;
వందలాది మంది పూజిస్తారు అతడి మాటని
ఏమైనా వాడొక మొద్దు, అంతమాత్రానికని.
అంతమాత్రానికని, అటువంటివన్నీ,
అతడి భుజకీర్తులు, నక్షత్రాలు, అటువంటివన్నీ,
స్వతంత్రపు మనసున్న మనిషి
చూసి, నవ్వుతాడు అటువంటివన్నీ.

యువరాజు చేయగలుగుతాడు సాహస యోధుడిని
మండలాధీశుడిని, సామంతరాజుని, అటువంటివన్నీ.
కాని, నిజాయితీ గలవాడుంటాడు అతడి శక్తికి పైనని
మంచి విశ్వాసం ఉంటుందా, అంతమాత్రానికని?
అంతమాత్రానికని, అటువంటివన్నీ
వాళ్ల హోదాలు, ఘనతలు అటువంటివన్నీ
ఇంద్రియపు చేవ, విలువైన గర్వం
వాటికన్నా గొప్పవి, అటువంటివన్నీ.

అప్పుడు మనం ప్రార్థిద్దాం, అది వస్తే వస్తుందని.
(అది వస్తుంది తప్పక, అంతమాత్రానికని)
ఆ సంవేదన, ఆ విలువ, ఈ మొత్తం భూమిపైన
భరిస్తుంది దురాశను, అటువంటివన్నీ,
అంతమాత్రానికని, అటువంటివన్నీ
అయినా అది వస్తుంది, అంతమాత్రానికని.
మనిషి నుంచి మనిషికి, ప్రపంచమంతటా
అందరూ సోదరులే, అటువంటివన్నీ.

✧✧✧✧✧

2. ఎర్ర, ఎర్ర గులాబి

(The Red, Red Rose)

ఎర్ర ఎర్ర గులాబీ నా ప్రేమ
జూన్‌లో విరిసిన పూ లలామ
శ్రావ్యమైన గీతం నా ప్రేమ
స్వరాలు నిండిన మాధుర్య సీమ

ఎంత అందమైన దానివే సొగసైన చినదానా!
అంత లోతైన ప్రేమలో మునిగాను నిలువునా,
ఇంకా నిన్ను ప్రేమిస్తాను ప్రియతమా,
సముద్రాలన్నీ ఎండిపోయేంత వరకూ, నేస్తమా!

సముద్రాలన్నీ ఎండిపోయేంత వరకూ, ప్రియతమా,
మండే ఎండకు కొండశిలలు కరిగేంత వరకూ,
ఇంకా నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను ప్రియతమా,
జీవన సైకత ప్రవాహాలు ప్రవహిస్తున్నంత వరకూ.

వీడ్కోలు నీకు, నా ఏకైక ప్రియతమా,
వీడ్కోలు నీకు ఒకింత సేపు.
నేను తిరిగి వస్తాను, ప్రియతమా,
పదివేల మైళ్ల దూరమైనా, చిటికెలో నీవేపు సుమా!

✧✧✧✧✧

1794లో వ్రాయబడిన ఈ కవిత స్కాటిష్ జానపద గేయాల్లో ముఖ్యమైనది. పదేళ్లపాటు శ్రమించి Robert Burns దాదాపు 300 గీతాల్ని సేకరించినాడు.

ఈ పాటకు 1821లో Robert Archibald Smith ఇచ్చిన వరుస– 'Low down in the broom' – ప్రసిద్ధికెక్కగా Pat Boone లాంటి గాయకులు గానం చేసినారు. Bob Dylan కు ఇష్టమైన కవిత ఇది.

3. ఈలవేయి, నీవద్దకు వస్తాను, ఓ నా సొగసుకాడా!

('O', Whistle and I will come to you, My lad)

ఈలవేయి, నీ వద్దకు వస్తాను, ఓ నా సొగసుకాడా!
ఈలవేయి, నీవద్దకు వస్తాను, ఓనా వన్నెలరేడా!
మా అమ్మా, నాన్నా, నేనూ పిచ్చెక్కిపోయినా
ఈల వేయి చాలు, నీవద్దకు వస్తాను, ఓ నా ముద్దుల ప్రియుడా!

కాని, నన్ను కలుసుకునేందుకు వచ్చేప్పుడు, కాసింత జాగ్రత్త
వెనక తలుపు తెరిచుంటే వెనకవేపు రాగలవు
నక్కినక్కి రావోయి, ఎవరినీ చూడనీకు.
నా వద్దకు రానట్లే రావోయి నీవు.
నా వద్దకు రానట్లే రావోయి నీవు.

చర్చివద్దనైనా, సంతలోనైనా, నన్నెక్కడ కలిసినా
ఈగను చూచినట్లు కూడా నావేపు చూడవద్దు
కాని, నీ నల్లని కళ్లతో దొంగచూపు చూడవోయి.
నావేపు చూడనట్లే చూడవోయి నీవు
నావేపు చూడనట్లే చూడవోయి నీవు.

నేనంటే ఇష్టంలేనట్లు అడ్డుచెప్పు, ప్రతిన చేయి,
నా అందాలను తేలికగా తీసివేసి తోసివేయి,
కాని, హాస్యంగా కూడా, ఇంకొకరి జత కూడవద్దు.
ఆమె నీ దృష్టిని నానుంచీ మళ్లించే భయం నాకు,
ఆమె నీ ప్రేమను మళ్లిస్తుందని భయమోయీ నాకు.

✧✧✧✧✧

1793లో రాబర్ట్ బర్న్స్ వ్రాసిన కవిత.

4. ఓ లామ్మాస్ రాత్రి...

(It was upon a Lamma's Night)

లామ్మాస్ రాత్రి మధ్యయుగం నాటి ఐరిష్ పండుగ, లఘుదేవుడిని (Lagh), అతడి పెంపుడు తల్లి తైలితియు (Tailtiu) (ఐర్లండ్ దేశంలోని కఠిన శిలలను తొలగించి వ్యవసాయానికి అనువుగా చేసి, అలసిపోయి కన్నుమూసిన దేవత) దేవతకు ధన్యవాదాలు తెలియజేసే పండుగ రాత్రి. Lammas = loaf mass).

ఓ లామ్మాస్ పండుగ రాత్రి
మొక్కజొన్న పొలం మోహం రేకెత్తించే వేళ
మబ్బులు లేని వెన్నెల వాన లోన
'ఏనీ'ను నేను, పొదుముకున్నాను దగ్గరకు,
కాలం ఎగిరిపోయింది డేరాలేని మెలకువలోకి
ఆలస్యానికి, వేకువకు మధ్య సమయం వరకు,
కొద్ది ప్రోత్సాహంతో అంగీకరించిందామె
నన్ను బార్లీ పొలాలలో చూసేందుకు.

నీలి నీలి ఆకాశం, నిశ్శబ్దమైన గాలి
స్పష్టంగా వెలుగుతున్న చంద్రుడు
మంచి మనసుతో నేను, కూర్చోబెట్టాను ఆమెను
అందమైన ఆ బార్లీ పొలం మధ్యన
ఆమె హృదయాన్ని గెల్చుకోవడమే నా లక్ష్యం
ఆమెను ప్రేమించాను మనస్ఫూర్తిగా నేను,
మరల, మరల, మరల ముద్దాడాను ఆమెను
అందమైన ఆ బార్లీ పొలం మధ్య

ఆమెను గాఢమైన కౌగిలిలో బంధించాను
ఆమె హృదయం స్పందిస్తున్నది అందంగా
ఆ ఆనందదాయకమైన స్థలానికి నా ఆశీస్సులు
అందమైన ఆ బార్లీ పొలం మధ్యన;
ప్రకాశిస్తున్న చంద్రుడు, తారల పక్కన
ఆ ఘడియలలో విస్పష్టమైన వెలుగును
ఆమె ఆ ఆనందపు రాత్రిని దీవించును
అందమైన ఆ బార్లీ పొలం మధ్యన;

నేను నా మిత్రులతో ఉల్లాసంగా గడిపాను.
హాయిగా తాగుతూ ఆనందించాను
నేను సంతోషపు గుంపులతో తిరిగాను
ఆనందంగా ఆలోచిస్తూ ఉన్నాను.
నేను పొందిన సంతోషాలన్నీ
మూడుసార్లు రెట్టించి లెక్కించినా
ఆ సంతోషపు రాత్రికి సాటిరావు ఏమాత్రం,
అందమైన ఆ బార్లీ పొలం మధ్యన.

మొక్కజొన్న పొలాలు, బార్లీ పొలాలు
మోహం రేకెత్తించే మొక్కజొన్న పొలాలు
ఆ సంతోషపు రాత్రిని నేను మరచిపోలేను
'ఏనీ'తో ఆ పొలాల మధ్యన.

✧✧✧✧✧

Anne Rankine ఓ రైతు చిన్నకుమార్తె. ఓ సత్రపు యజమాని John Merry ని వివాహమాడింది. 1782లో Robert Burns ఈ కవిత వ్రాసినాడు. ఆమె కథనం ప్రకారం అతడు తన స్నేహితుడని, తన ముంగురులను, కవితను తనకు ప్రేమపూర్వకంగా ఇచ్చాడని చెప్పుకునేది. Robert Burns మౌనం ఈ వాదాన్ని బలపరుస్తున్నది.

5. తియ్యని ముద్దు

(Ae fond Kiss)

తియ్యని ముద్దివ్వు, విడిపోదాం ఇప్పటికి.
వీడ్కోలు పలుకు, విడిపోదాం ఎప్పటికీ!
ఎదలోపలి కన్నీటితో ప్రతిజ్ఞ చేస్తాను
యుద్ధపు నిట్టూర్పులు, మూల్గులతో పందెం కాస్తాను.

ఎవరనగలరు అతడిని అదృష్టం ఏడిపిస్తుందని,
అదృష్టపు నక్షత్రం అతడిని విడిచి వెళ్తుందని?
నన్ను, ఏ చిరునవ్వుల మెరుపు వెలిగించదు
గాఢమైన నిరాశ కప్పివేస్తుంది చీకటిలో నన్ను.

నా అసంపూర్తి ఊహలను నిందించబోను
ఏదీ అడ్డుకోలేదు నా నాన్సీని.
ఆమెను చూడడమే, ఆమెను ప్రేమించడం.
ఆమెను ప్రేమించడం, ఎప్పటికీ ప్రేమించడం.

ఎంతో గాఢంగా మేము ప్రేమించుకోనట్లయితే
ఎంతో గుడ్డిగా మేము ప్రేమించుకోనట్లయితే
కలిసేవాళ్లమూకాదు, విడిపోయేవాళ్లమూ కాదు.
ముక్కలైన గుండెలతో ఉండేవాళ్లమూ కాదు.

వీడ్కోలు, నీవు నా తొలి ప్రియురాలివి, అందానివి.
వీడ్కోలు, నీవు నా ప్రియమైనదానివి, ఇష్టురాలివి.
నీవు నాకు ఆనందానివి, విలువైన నిధివి
శాంతివి, సౌభాగ్యానివి, ప్రేమవు, సంతోషానివి.

తియ్యని ముద్దివ్వు, విడిపోదాం ఇప్పటికి;
వీడ్కోలు పలుకు, విడిపోదాం ఎప్పటికీ!
ఎదలోపలి కన్నీటితో ప్రతిజ్ఞ చేస్తున్నాను.
యుద్ధపు నిట్టూర్పులు, మూల్గులతో పందెం కాస్తున్నాను.

✧✧✧✧✧

Robert Burns ఎడింబరో వెళ్లినపుడు Agnes Maclehose తో ఏర్పడిన Platonic love - అమలిన శృంగార ప్రణయంలో వారిద్దరూ Clarinda, Sylvander పేర్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకునేవారు. 1791లో ఆమె జమైకా వెళ్లిపోతున్నపుడు రాబర్ట్‌బర్న్స్ వ్రాసిన వీడ్కోలు గీతమిది.

6. ఆనాటి జ్ఞాపకాల కోసం

(Auld lang syne - Old long since - long long ago)

పాత పరిచయాలను మరచిపోవాలా,
మనసులోకే మరలా రానివ్వకూడదా?
పాత స్నేహాలను మరచిపోవాలా,
ఆనాటి జ్ఞాపకాలను?

ఆనాటి పాత జ్ఞాపకాల ఆనందం కోసం
గత స్మృతులలో గడిపేందుకు
మనం స్వీకరిద్దాం ఓ కప్పునిండా కరుణను
ఆ ఆనాటి జ్ఞాపకాల కోసం.

నీవు ఖచ్చితంగా నీ పింట్-స్టాపు దగ్గర ఆగుతావు.
నేనూ ఆగుతాను నాకిష్టమైన దగ్గర!
మనం స్వీకరిద్దాం ఓ కప్పునిండా కరుణను
ఆ ఆ నాటి జ్ఞాపకాల కోసం,
అలనాటి జ్ఞాపకాల కోసం...

మనిద్దరం పరిగెత్తాం మనిష్టం వచ్చినట్లు
అందమైన వాళ్లతో ఆనందంగా గడిపాము
డబ్బు వెదజల్లాం విచ్చలవిడిగా, డాబుగా,
అవి, ఆ ఆనాటి జ్ఞాపకాల కోసం
అలనాటి జ్ఞాపకాల కోసం

మనిద్దరం తిరిగాం ఎండలో పడవపై
ఉదయపు సూర్యుడితో, సంధ్యాసమయం వరకూ
మనిద్దరి మధ్య గర్జించాయి సముద్రాలు
అవి, ఆ ఆనాటి జ్ఞాపకాల కోసం
అలనాటి జ్ఞాపకాల కోసం.

అదుగో నా హస్తం, నేను నమ్మిన అప్సర కన్యా!
నీ హస్తాన్ని ఇటు ఇవ్వు
మనం మాట్లాడుకుందాం మంచి మంచి విషయాలను
అవి, ఆ ఆనాటి జ్ఞాపకాల కోసం
అలనాటి జ్ఞాపకాల కోసం.

✧✧✧✧✧

ప్రజాకవి (People's Poet) గా రష్యన్ ప్రజలచే కీర్తించబడిన రాబర్ట్‌బర్న్స్ ఆంగ్లో-స్కాటిష్ కవి. 17 డిసెంబర్ 1788లో అతడు వ్రాసిన Auld Lang Syne కవిత ఇప్పుడు నూతన సంవత్సర ప్రారంభంలో శుభాకాంక్షలు తెలిపే ప్రసిద్ధగీతంగా మార్మోగుతున్నది.

Anonymous కవితగా 1568లో- Auld Kyndness foryett గా, Sir Robert Ayton (1570-1638) వ్రాసిన కవితలో 'Should auld acquaintances be forgot గా, Allan Rambay (1686-1757; James Watson 1711) కవితలలో, 1694లో ప్రచురింపబడిన వ్యాసంలో- Auld lang Syne - అన్న వాక్యం, ఒక వీధి పాటలోని 'on old long syne' చరణంగా (Francis Sempill or Robert Ayton) ఇంకా కొన్ని వీరగాథల్లో (Ballads) ప్రముఖంగా వినబడినా రాబర్ట్ బర్న్స్ కవితలో ఈ వాక్యం అజరామరమై నిలిచింది.

పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పడానికే కాక, స్నాతకోత్సవాలలో, అంత్యక్రియలలో, Boy Scout Youth Movements లో వీడ్కోలు గీతంగా ఈ స్కాటిష్ జానపద గేయం ప్రసిద్ధికెక్కినది. అనేక భాషలలోకి అనువదించబడినది.

In the Auld Lang Syne - అనే వాక్యాన్ని Once upon a time... అనగనగా ఒకరోజున... గా జానపద కథల్లో తొలివాక్యంగా Mathew Filt వాడినాడు.

ఇండియా, బంగ్లాదేశ్‌లలో బెంగాలీ గీతమైన 'పురానె షెయి దినెర్ కొథా' - పాతరోజుల జ్ఞాపకాలు- గీతానికి రవీంద్రనాథ టాగోర్ స్వరకల్పన చేసినాడు.

Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

కవిత్వం (తెలుగు) **(Poetry) :**

1. ఆల్కెమీ
2. వానమబ్బుల కాంతిఖడ్గం
3. టీకప్పులో తుఫాను
4. తంగేటి జున్ను
5. కర్కాటకం (క్యాన్సరు) (First Poetry Book about Cancer in Telugu)
6. ఒక సరస్సు-అనేక హంసలు (First Poetry Book about Psychiatry in Telugu)
7. మరణ శాసనం - దీర్ఘ కవిత.
8. శ్రీ లలితాసహస్రనామ స్తోత్రం

కవిత్వం (ఇంగ్లీషు) **(Poetry) :**

1. **Shades**
2. **The Twilight Zone**

నవలలు **(Novels) :**

1. **In Search of Truth (English)**
2. సత్యాన్వేషణలో (తెలుగు)
3. జీనోమ్ (తెలుగు) (First Biotechnology Novel in Telugu)

కథలు, వ్యాసాలు **(Stories, Essays) :**

1. కత్తి అంచుపై... (First Noir Stories in Telugu)
2. ఛుప్ కె ఛుప్ కె (రహస్యభాష) (స్త్రీల వ్యాధులు)
3. అక్షరార్చన

ఇతరాలు (Others) :

1. దీప నిర్వాణగంధం (About Death)
2. స్వప్నశాస్త్రం (Dreams-1)
3. కలలు–పీడకలలు (Dreams-2)
4. సంఖ్యాశాస్త్రం (Numerology)
5. **How to be Happy**
6. డా. జయదేవ్ కార్టూన్లు
7. **Bouquet of Telugu Songs and Poems**

అనువాదాలు (English to Telugu) Translations :

1. ఇలియాడ్ (Homer) - **Iliad**
2. ఒడెస్సీ (Homer) - **Odyssey**
3. ఎపిక్ సైకిల్ (Homer) - **Epic Cycle**
4. మూడు గ్రీకు ట్రాజెడీలు - **Three Greek Tragedies**
5. ఈనీడ్ (Virgil) - **Aenied**
6. తీర్థయాత్రికుని ప్రగతి (John Bunyan) - **Pilgrims Progress**
7. పారడైజ్ లాస్ట్ & రిగైన్డ్ (John Milton) - **Paradise Lost & Paradise Regained**
8. డివైన్ కామెడీ (Dante) - **Divine Comedy**
9. ఫాస్ట్ (Goethe) - **Faust**
10. నామదేవొ ధసాల్ కవిత్వం (NamDeo Dhasal) Poetry
11. ప్రపంచ ప్రసిద్ధ కథలు (World Famous Stories)
12. విలియం బ్లేక్ కవిత్వం (William Blake Poetry)
13. రసధుని (Russian Poetry)
14. జలపాతం (అష్టాదశ ఆంగ్ల కవుల కవిత్వం) (18 English Poets)
15. క్రీస్తు అద్భుతగీతాలు (The Wonderful Poems on Christ)
16. క్రీస్తు నడచిన దారి (The Path of Christ)
17. మస్నవి 1 – 6 (మౌలానా జలాలుద్దీన్ రూమి) - **Masnavi**
18. పక్షుల సభ (ఫరీదుద్దీన్ అత్తర్) - **Conference of Birds**
19. శిలప్పదికారం (తమిళ సాహిత్యం) - **Silappadikaram**
20. మణిమేఖల (తమిళ సాహిత్యం) - **Manimekhala**
21. తమిళ సరస్వతి అందెల రవళి (తమిళ సాహిత్యం) - **Sangam Poetry**
22. డబ్బు–మని–షి - **Money Poetry**
23. శాంతి యుద్ధం - **War-Peace Poetry**

24. ఎమిలి డికెన్‌సన్ కవిత్వం 1-5 (తెలుగులో)
25. సౌగంధిక (కవిత్వం)
26. తూర్పు-పడమర (కవిత్వం) (Master Poems in English)
27. ప్రేమ కురిసిన వేళలో... (కవిత్వం) (Master Poems in English)
28. వాళ్లు ముగ్గురు (కవిత్వం) (Master Poems in English)
29. అలనాటి కొత్తగాలి (కవిత్వం) (Master Poems in English)
30. మంచు తుఫాను (కవిత్వం) (Master Poems in English)

అనువాదాలు (తెలుగు మరియు ఇతర భాషల్నుంచి ఇంగ్లీషులోకి) **Translations :**

1. **Modern Bhagavad Geeta** (Poetry) (Vyasa)
2. **Soundarya Lahari** (Poetry) (Sankaracharya)
3. **Bhagavatam** (Poetry) (Potana)
4. **Samparayam** (Poetry) (Suprasanna)
5. **The Tree of Fire** (Poetry) (Anumandla Bhoomaiah)
6. **The Pool of Blood** (Novel) (Ampasayya Naveen)
7. **The Poems of Kuppam** (Poetry) (Seeta Ram)
8. **The Broken Grammar** (Poetry) (T.W. Sudhakar)
9. **We need a language** (Poetry) (T.W. Sudhakar)
10. **This is No Streaking** (Stories) (K.K. Menon)
11. **The Voice of Telangana** (Poetry) (Madiraju Ranga Rao)
12. **Satarupa** (Poetry) (A.K. Khanna)
13. **Fire & Ice** (Poetry) (Rama Chandramouli)
14. హిందీ నుంచి తెలుగులోకి - మధుశాల (హరివంశరాయ్ బచ్చన్)

శతకాలు (Poetry) :

1. కుయ్యోమొర్రో శతకం
2. భైరవ శతకం
3. కాయగూర శతకం
4. అయ్యబాబోయ్ శతకం

త్వరలో (Poetry) :

1. దైవమార్గం (మహమ్మదీయ మతం) (Poetry)
2. సెలయేరు (Master Poems - English to Telugu)
3. ఎండా-వానా (కవిత్వం) (Master Poems in English)

4. **పిల్లనగ్రోవి పిలుపు** (కవిత్వం) (Master Poems in English)
5. **నాలుగు దిక్కులు** (కవిత్వం) (Master Poems in English)
6. **అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె** (కవిత్వం) (Master Poems in English)
7. **దివ్య వస్త్రాల కోసం** (కవిత్వం) (Master Poems in English)
8. **ఆమని** (కవిత్వం) (Master Poems in English)
9. **ఒక మధుశాల** (కవిత్వం) (Master Poems in English)
10. **కొత్త దీపాలు** (కవిత్వం) (Master Poems in English)
11. **మరుభూమి** (కవిత్వం) (Master Poems in English)
12. Odysseus Elytis '**The Axion Esti**' **Worthy it is** - ఇది విలువైనది.
13. Frederico Garfcia Lorca "**Love & Death**" - ప్రేమ – మృత్యువు
14. పదివేల పంక్తులు (ప్రపంచశాంతి కోసం) ఎడ్విన్ కార్డివిల్లా **(Part-I)**
15. Bees Need No Invitation When Flowers Bloom...
16. **పాబ్లో నెరుడా కవిత్వం–1**

ప్రపంచ సాహిత్యం-37

అలనాటి కొత్తగాలి

Master poems of English 1709-1796

1709-1796 మధ్యకాలంలోని ఆరుగురు కవులు-
శామ్యూల్ జాన్సన్, థామస్ గ్రే, విలియం కాలిన్స్, క్రిస్టఫర్ స్మార్ట్,
ఆలివర్ గోల్డ్‌స్మిత్, రాబర్ట్ బర్న్స్ - వ్రాసిన అద్భుత గీతాల
అనువాద సంపుటి ఈ **'అలనాటి కొత్తగాలి'**

ఈ ఆరుగురు కవుల కవితలలోని కొత్తగాలి తర్వాత కాలంలో పెనుమార్పులకు ప్రేరణ అయినది. ఆంగ్లకవిత్వంలో Master Poems గా ప్రసిద్ధికెక్కిన కవితలను అనువదించే యజ్ఞంలో భాగంగా వస్తున్న ఈ కవితా సంపుటిని తెలుగు సాహితీలోకం ఆశీర్వదిస్తుందని సృజనలోకం మనసారా విశ్వసిస్తున్నది.

డాక్టర్ లంకా శివరామప్రసాద్